
ఒంగోలులో ఒక్కసారిగా ఇసుక ధర టన్నుకు రూ.300 పెరిగింది. దీంతో నగరంలో కొంతమంది భవన నిర్మాణాలను నిలిపివేశారు. బేల్దారి పనులు చేసేవారికి సైతం పనులు లేకుండాపోయాయి. జిల్లాలో ఇసుక లభ్యత ఎక్కువగా లేదు. నెల్లూరు నుంచి తేవాల్సి వస్తోంది. దానికి రవాణా, లోడింగ్ చార్జీలు మాత్రమే తీసుకొని విక్రయిస్తుంటారు. రెండు వారాల క్రితం వరకూ టన్ను ఇసుక కేవలం రూ.500కు అందుబాటులో ఉండేది. ఈ మేరకు టిప్పరు (40 టన్నులు) ఇసుకను రూ.20వేలకు సరఫరా చేసేవారు. ఇటీవల ఒక్కసారిగా టన్ను రూ.800కు పెంచి టిప్పరుకు రూ.32వేలు వసూలు చేస్తున్నారు. దీంతో ఇసుక బరువై నిర్మాణదారులు ఇబ్బందిపడుతున్నారు.





ఇసుక ప్రియం

కృత్రిమ కొరత సృష్టిస్తున్న వాహన యజమానులు

టన్నుకు రూ.300 పెంచి విక్రయం

కృత్రిమ కొరత సృష్టిస్తున్న టిప్పర్ యజమానులు

ప్రభుత్వం అధికారికంగా ఒంగోలులో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో టన్ను ఇసుక ధర రూ.980గా ఉంది. భవన నిర్మాణదారుడు నేరుగా నెల్లూరు నుంచి ఇసుకను తెచ్చుకునే వెసులుబాటు ఉంది. దాన్ని ఆసరా చేసుకొని టిప్పర్‌ల వారు ఇసుకను అక్కడి నుంచి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. వారివద్దే తక్కువ ధరకు లభిస్తుండటంతో నిర్మాణదారులు స్టాక్ పాయింట్‌లో కాకుండా బయటే కొనుగోలు చేస్తున్నారు. రెండు వారాల క్రితం వరకూ టిప్పర్‌ల యజమానులు టన్ను ఇసుకను రూ.500కు అమ్మారు. ఇప్పుడు ఒక్కసారిగా టన్ను ధర రూ.800కు పెంచేశారు. తీవ్రమైన వర్షాల కారణంగా పెన్నా నదిలో ఇసుక లభ్యం కావడం లేదని చెబుతున్నారు. అలాగే ప్రైవేటు సైన్యానికి రూ.150తోపాటు మరో రూ.150 అధికారులకు మామూళ్లు ఇవ్వాల్సి వస్తుందంటున్నారు. అందుకే టన్ను రూ.800కు విక్రయిస్తున్నామని బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పనిలో పనిగా కృత్రిమ కొరతను సృష్టించి ధరలు పెంచి విక్రయిస్తున్నారు.

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ధర ఒక్కసారిగా పెరగడంతో నిర్మాణరంగంపై భారం పడింది. దీంతో బేల్దారి కూలీలకు పనులు దొరకడం లేదు. ఇసుక ఇటీవలి వరకు టన్ను రూ.500కు విక్రయించేవారు. దీంతో నిర్మాణదారులు ఉత్సాహంగా భవనాలు నిర్మిస్తున్నారు. అయితే రెండు వారాల నుంచి టన్ను ధర అదనంగా రూ.300కుపైనే పెంచేయడంతో వారిపై పిడుగుపడింది. పరిమితికి మించిన రవాణా అంటూ యంత్రాంగం దాడులు, ప్రైవేటు సైన్యం వసూళ్లతోనే ధర పెరిగిందని సమాచారం. సాధారణంగా నెల్లూరు నుంచి 30 నుంచి 40 టన్నులు రవాణా చేస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని టిప్పరు యజమానులు చెబుతున్నారు. అలా రవాణా చేస్తేనే ఒంగోలుకు టన్ను ఇసుక రూ.500కు సరఫరా చేయగలమని అంటున్నారు. వీరు భవన యజమానుల పేరుతో ఇసుక రవాణా చేసుకుంటున్నారు. అయితే ఓవర్ లోడ్ పేరుతో

- భవన నిర్మాణ రంగంపై భారం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఇటీవల రవాణా, మైనింగ్ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని టిప్పర్ యజమానులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం టిప్పరులో 20 టన్నులు మాత్రమే రవాణా చేయాల్సి ఉంది. అయితే 30 నుంచి 40 టన్నులు ఇసుక రవాణా చేయడం నిబంధనలకు విరుద్ధమని పోలీసు, మైనింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో టిప్పర్లపై కేసులు నమోదు చేయడంతో నెల్లూరుకు చెందిన టిప్పర్ల యజమానులు రవాణాను తగ్గించివేశారు. అదేక్రమంలో ఒంగోలుకు చెందిన కొంతమంది టిప్పరు యజమానులు ఇసుక రవాణాను వదిలేసి గ్రావెల్ తరలిస్తున్నారు. ఇలా అధికారులు ఓవర్ లోడ్ అని వేధిస్తుండగా

మిగతా 6వ పేజీలో



కాళరాత్రిగా త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీ దేవి



సరస్వతీ అలంకరణలో ఒంగోలు కేపీ రోడ్డులోని రాజరాజేశ్వరి

సరస్వతీ.. నమోస్తుతే..

దేవీశరన్నవరాత్రులు జిల్లావ్యాప్తంగా నయనానందకరంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదోరోజైన సోమవారం ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. మూలానక్షత్రం కావడంతో సరస్వతీ పూజతోపాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కొందరు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి అలంకరణలను కనులారా తిలకించి పులకించారు. రాత్రికి పలుచోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి. త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి కాళరాత్రిగా గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఎక్కువ చోట్ల అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో కటాక్షించారు.

- వివరాలు లోపలి పేజీల్లో..



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్

ఆర్టీసీకి దసరా తాకిడి..!

జిల్లా నుంచి 100 స్పెషల్ సర్వీసులు

స్త్రీశక్తి బస్సుల్లో రోజుకు లక్ష మంది

- ఇతర బస్సుల్లో సాధారణ చార్జీలు వసూలు
- అదనపు చార్జీల భారం తొలగింపుతో ఉపశమనం
- ప్రయాణికులతో రద్దీగా బస్టాండ్‌లు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీకి ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఇప్పటికే స్త్రీశక్తి పథకం ద్వారా బస్సులన్నీ కిటకిటలాడుతుండగా, మరోవైపు పండుగకు సొంతూర్లకు వెళ్లేందుకు జిల్లాకు వస్తున్న వారి కోసం ఆర్టీసీ అదనపు బస్సులను కేటాయించింది. రీజియన్ పరిధిలో మొత్తం 485 బస్సులు నడుస్తుండగా అందులో 316 స్త్రీశక్తికి కేటాయించారు. వాటిలో రోజుకు లక్ష మంది వరకు ప్రయాణిస్తున్నారు. పండుగ ప్రభావంతో వారి సంఖ్య మరింత పెరిగింది. సూపర్ లగ్జరీ, గరుడ, వెన్నెల, తదితర ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో చార్జీలతో ప్రయాణం చేయాల్సి ఉండటంతో దూరప్రాంత ప్రయాణికుల రాక జిల్లాకు పెరిగింది. ఈనేపథ్యంలో హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, విజయవాడ, శ్రీశైలం ప్రాంతాలకు అదనంగా వంద బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో

మిగతా 6వ పేజీలో

ట్రూడౌన్



విద్యుత్ వినియోగదారులకు భారీ ఊరట

- రూ.25.78 కోట్లు తిరిగి చెల్లింపు
- దాదాపు 10 లక్షల మందికి లబ్ధి
- వచ్చే బిల్లులో సర్దుబాటుకు చర్యలు
- త్వరలో మరికొంత చెల్లించే అవకాశం

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ రంగంలో తొలిసారి వినియోగదారులకు ట్రూఅప్ చార్జీల కింద వసూలు చేసిన సొమ్మును తిరిగి చెల్లించాలని విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) నిర్ణయం తీసుకొని తీపికబురు చెప్పింది. ఈ మేరకు ఈనెల 27న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.923.55 కోట్లు విద్యుత్ చార్జీలలో జమ చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులపై భారం మోపిన విషయం విదితమే. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఆదిశగా తొలి అడుగు వేసింది. జిల్లాలో ట్రూడౌన్ చార్జీల కింద రూ.25.78 కోట్లు వినియోగదారుల బిల్లులకు జమ చేయనుంది. దీంతో 10లక్షల మంది వినియోగదారులు లబ్ధి పొందనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు పేర్లతో కరెంట్ బిల్లు పట్టుకుంటే షాక్ కొట్టే విధంగా చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం విద్యుత్ రంగంపై దృష్టి సారించి తొలిసారిగా ట్రూడౌన్ చార్జీలు అంటూ వినియోగదారులకు వారు చెల్లించిన నగదు తిరిగి ఇవ్వనుంది.

ట్రూ అప్ అంటే..

విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) కరెంట్ కొనుగోలు, పంపిణీకి సంబంధించి అయ్యే ఖర్చును లెక్కించి వినియోగదారుల నుంచి ముందుగానే వసూలు చేస్తాయి. అందుకు సంబంధించి ఈఆర్‌సీ ఆదేశాల మేరకు ధరలు నిర్ణయిస్తాయి. డిస్కంలకు వాస్తవ ఖర్చు ఎక్కువగా వస్తే దానిని లెక్కించి ట్రూఅప్ చార్జీల రూపంలో వసూలు చేసుకునేందుకు అనుమతి ఇస్తాయి. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా కొనుగోళ్లు చేశారు. దీంతో ట్రూఅప్ చార్జీల భారం పడింది.

ట్రూడౌన్ చార్జీలు అంటే

విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) అనుమతి ఇచ్చిన దాని కంటే డిస్కంలకు విద్యుత్

మిగతా 6వ పేజీలో

చార్జీల సర్దుబాటు ఇలా..

ట్రూడౌన్ చార్జీల రూపంలో జిల్లాకు వస్తున్న రూ.25.78 కోట్లను ఈ ఏడాది నవంబరు నుంచి 2026 అక్టోబర్ వరకు వచ్చే బిల్లులో యూనిట్‌కు 13పైసల చొప్పున వినియోగదారులకు సర్దుబాటు చేస్తారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగదారులు వినియోగించుకున్న యూనిట్లకు లెక్కకడతారు. అంటే సుమారు యూనిట్‌కు 13పైసల చొప్పున గత ఏడాది కాలంలో వినియోగించిన యూనిట్లకు లబ్ధి చేకూరుతుంది. ఉదాహరణకు వినియోగదారుడు ఏడాది కాలంలో సరాసరి 2,400 యూనిట్లు వినియోగిస్తే అందుకు సంబంధించి రూ.322 లబ్ధి చేకూరుతుంది. 2024 ఏప్రిల్‌లో ఒక వినియోగదారుడు 200 యూనిట్లు వినియోగిస్తే అందుకు సంబంధించి ట్రూడౌన్ చార్జీలు రూ.26.86 వస్తాయి. ఈ మొత్తాన్ని ఈ ఏడాది నవంబర్‌లో వచ్చే బిల్లులో సర్దుబాటు చేయనున్నారు. అలా 2024 మేలో వచ్చిన ట్రూడౌన్ చార్జీలు ఈ ఏడాది డిసెంబర్‌లో సర్దుబాటు చేస్తారు. ఇలా వచ్చే ఏడాది అక్టోబర్ వరకు తిరిగి ఇస్తారు.

సారొస్తారో రారో?

- కొత్త ఉపాధ్యాయుల కోసం ఎదురుచూపులు
- వైపాలెం నియోజకవర్గంలో అధికంగా ఉన్న ఖాళీలు
- కొన్ని అయినా భర్తీ అవుతాయనే ఆశలు

7



7

శిక్షణ పూర్తి చేసిన వారికే డీఎస్సీ పోస్టింగ్‌లు



చిరుత పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

మరపగుంట్లలో చిరుత సంచారం!

- భయాందోళనలో గ్రామస్థులు
- ఒంటరిగా పొలాలకు వెళ్లొద్దని అటవీ అధికారుల సూచన

వెలిగండ్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెలిగండ్ల మండలం మరపగుంట్ల పంట పొలాల్లో సోమవారం చిరుత పులి సంచారంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. రోజూలాగే పనుల నిమిత్తం గ్రామస్థులు పొలాల్లోకి వెళ్లగా వారిని గమనించిన చిరుత అక్కడి నుంచి వెళ్లిపోయింది. రైతులు, కూలీలు భయాందోళన చెంది గ్రామంలోకి పరుగులు తీశారు. విషయం తెలిసి గ్రామస్థులు చిరుత సంచరించిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ దాని అడుగులను గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆప్రాంతానికి చేరుకు న్నారు. చిరుతపులి అడుగు జాడలను గుర్తించిన అధికారులు అవి చిరుత పులివా.. ఇతర జంతువివా? అని నిర్ధారించలేకపోయారు. ఇదిలాఉండగా పొలాల్లో చిరుత పులి కనిపించిందన్న సమాచారంతో పరిసర ప్రాంత గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల వద్దకు రైతులు ఒంటరిగా వెళ్లకుండా కొన్నిరోజులపాటు జాగ్రత్త వహించాలని అటవీ అధికారులు సూచించారు



6

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

టీడీపీలో చేరిన 40 కుటుంబాలు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

- జేసీ గోపాలకృష్ణ పిలుపు

7

నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించను!

కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక

సీఎస్‌పురం, హెచ్‌ఎంపాడు తహసీల్దార్లపై ఆగ్రహం

కనిగిరిలో 'మీ కోసం'కు పోటెత్తిన అర్జీదారులు



సీఎస్‌పురం, హెచ్‌ఎంపాడు తహసీల్దార్‌లపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న కలెక్టర్ రాజాబాబు

కనిగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని కలెక్టర్ రాజాబాబు స్పష్టం చేశారు. పనితీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సోమవారం కనిగిరిలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో ఆయన పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా సీఎస్‌పురం, హనుమంతునిపాడు తహసీల్దార్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎస్‌పురం మండలం అంబవరం కొత్తపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 80లో 504 ఎకరాల ప్రభుత్వ భూమిలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని అదే మండలానికి చెందిన నాగూర్‌వలి ఫిర్యాదు చేశారు. పలుమార్లు అర్జీ ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. 1975-76 ప్రాంతంలో ఇచ్చిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. ఇదే సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి ఇప్పటికే అన్యాక్రాంతమైందని, దీని వెనుక గత తహసీల్దార్ నాగూర్‌వలి ఉన్నారని ఆరోపించారు. ఈవిషయంపై ప్రస్తుత తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నా కనీస చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ వారిరువురిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అర్జీపై నిర్ణీత కాలంలో పరిష్కరించకపోతే విధులు నుంచి తొలగిస్తానని హెచ్చరించారు.

సర్వే నంబర్ 432లో జరిగిన రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని ఫిర్యాదు

కనిగిరి పట్టణంలోని కందుకూరు రోడ్డులో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 432లో అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు జరిగాయని తాతపూడి శ్యామ్, తిరుపతిరావు ఫిర్యాదు చేశారు. 1975లో ఇచ్చిన పట్టాల స్థానంలోని భూమిలో కొంత మంది అక్రమార్కులు 433 సర్వే నంబరు, డోర్ నంబర్‌లతో అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు చేయించారని ఫిర్యాదు చేశారు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారని తెలిపారు. అప్పట్లో డీకే పట్టా మంజూరు చేసిన వారి పేరుతో కాకుండా

మిగతా 6వ పేజీలో


లాయర్‌పేట సాయిబాబా గుడిలో..


వాసవీ అమ్మవారి గుడిలో..

సరస్వతీ నమస్తుభ్యం

● మూలా నక్షత్రం కావటంతో సరస్వతీ దేవిగా అమ్మవారి దర్శనం

● పలువురు చిన్నారులకు విద్యాభ్యాసం

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మూలా నక్షత్రం కావటంతో పలు దేవాలయాలలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. స్థానిక కేశవస్వామి పేట శ్రీ విజయదుర్గా దేవస్థానం, బాలాజీరావుపేట శ్రీ కనకదుర్గా దేవస్థానం, గంటాపాలెం శ్రీ పార్వతీదేవి దేవస్థానం, మంగమూరు రోడ్డు శ్రీ అచలానంద ఆశ్రమం, శ్రీ గాయత్రి మందిరం, లాయర్‌పేట సాయిబాబా మందిరంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరం శ్రీ నాగలక్ష్మి అమ్మవారి దేవస్థానం, కొత్తపట్నం రోడ్డు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, బివిఎస్ హాలు దగ్గర ఉన్న శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలలో అమ్మవారికి సరస్వతీ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.


గడియారం వారి వీధిలో..


విజయదుర్గా దేవి గుడిలో..

ఇసుక ప్రియం

(5వ పేజీ తరువాయి)

కొంతమంది ప్రైవేటు సైన్యం తమకు టన్నుకు రూ.150 చెల్లించకపోతే కేసులు నమోదు చేయిస్తామని బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. దీంతో రెండు వారాలుగా నెల్లూరు నుంచి ఇసుక రవాణా చేయడం టిప్పర్ల యజమానులు ఆపేశారు. కొంతమంది మాత్రం ప్రైవేటు సైన్యంకు టన్నుకు రూ.150 చెల్లించి అదనపు ఖర్చులు వేసుకొని టన్ను రూ.800 నుంచి రూ.850 వరకు విక్రయిస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే జరిమానా వేస్తున్నాం

అక్రమంగా ఇసుక తరలిస్తే జరిమానాలు వేస్తున్నాం. జరుగుమల్లి నుంచి ఎక్కువగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఓవర్ లోడ్ చేసే వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తే అలాంటి వారికి జరిమానా విధిస్తున్నాం.

- రాజశేఖర్, మైనింగ్ డీడీ

బిల్లులు లేకుంటే కేసులు నమోదు

ఇసుక రవాణాకు బిల్లులు లేకుండా చేస్తే కేసులు నమోదు చేసి మైనింగ్ శాఖ ద్వారా జరిమానా వేయిస్తున్నాం. ప్రైవేటు సైన్యం వసూళ్ల విషయం మా దృష్టికి రాలేదు. నెల్లూరు నుంచి ఒంగోలుకు ఓవర్ లోడ్ వేసుకొని ఇసుకను తరలిస్తున్న టిప్పర్లపై కూడా కేసులు నమోదు చేస్తాం. అక్రమంగా ఇసుక తరలించడం నేరం.

- విజయ్‌కృష్ణ, తాలూకా సీఐ

ట్రూడౌన్

(5వ పేజీ తరువాయి)

పంపిణీకి, మరమ్మతులకు అయిన ఖర్చు తక్కువైతే మిగులు మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి సర్దుబాటు చేస్తారు. దీన్నే ట్రూడౌన్ చార్జీ అంటారు. విద్యుత్ కొనుగోలులో కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడంతో తొలిసారిగా డిస్కంలు ట్రూడౌన్ చార్జీలు వినియోగదారులకు సర్దుబాటు చేసే పరిస్థితి వచ్చింది.

మరోసారి చార్జీలు ఇచ్చే అవకాశం

రానున్న రెండు మూడు నెలలో మరో విడత ట్రూడౌన్ చార్జీలు వినియోగదారులకు ఇచ్చేందుకు ఏపీఈఆర్‌సీ సిద్ధమవుతోంది. 2019-24 మధ్య కాలంలో ట్రూఅప్ పేరుతో వసూలు చేసిన సొమ్ము పూర్తిగా వినియోగించ లేదు. దీంతో ఏపీ ట్రాన్స్‌కో మిగిలిన సొమ్మును వినియోగదారులకు చెల్లించాలని ప్రతిపాదించింది. ఆ మొత్తంపైనా ఏపీఈఆర్‌సీ నిర్ణయం తీసుకోనుంది. 2019-24 మధ్యలో పెట్టుబడి వ్యయం కింద వివిధ పనులకు ఏపీఈఆర్‌సీ అనుమతి ఇచ్చింది. అయితే ఆ మొత్తంలో వాస్తవంగా అయిన ఖర్చు తేడా ఉంది. ఈ వ్యత్యాసం మొత్తాన్ని ట్రూడౌన్ కింది వినియోగదారులకు సర్దుబాటు చేయాలని ట్రాన్స్‌కో ప్రతిపాదనలు పంపించింది. అప్పట్లో కరోనా కారణంగా అభివృద్ధి పనులు చేయలేదు. అందుకు సంబంధించిన నిధులు అలాగే మిగిలిపోయాయి. వాటిని తిరిగి వినియోగదారులకు సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్టీసీకి దసరా తాకిడి

(5వ పేజీ తరువాయి)

ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జనంతో కళకళలాడుతోంది. ఏ బస్సు చూసినా జనాలతో కిక్కిరిసి వెళుతోంది.

మూడు రోజులు సాధారణ చార్జీలు

ఇతర ప్రాంతాల్లోని ప్రజలు జిల్లాకు రానుండడంతో సోమవారం నుంచి బుధవారం వరకు స్పెషల్ బస్సులను సాధారణ చార్జీలతో నడపనున్నారు. సాధారణ రోజుల్లో షెడ్యూల్ సామర్థ్యానికి మించి ప్రయాణికులు సంఖ్య పెరగడంతో అందుకు అనుగుణంగా ఆర్టీసీ యంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్‌లో చార్జీలను భరించలేక అత్యధిక శాతం మంది ఆర్టీసీని వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా గతంలో పండుగ సమయాల్లో ప్రైవేటు బస్సులకే ప్రాధాన్యతనిచ్చే జిల్లా ప్రజలు ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన స్త్రీశక్తి బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

రోజుకు లక్షకుపైగా మహిళల ప్రయాణం

సాధారణ రోజుల్లోనే రోజుకు 1.5లక్షల మంది ఆర్టీసీలో ప్రయాణిస్తుండగా, పండుగ ప్రభావంతో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగింది. 2 లక్షల మందికిపైనే ప్రయాణిస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. అందులో మహిళలే లక్షకుపైగా ఉన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనంగా 100 బస్సులను కేటాయించారు. అయితే కొన్ని రూట్లలో తక్కువగా తిరిగే బస్సులను దసరా కోసం స్పెషల్ బస్సులుగా ఏర్పాటు చేశారు. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, చెన్నై, బెంగళూరు నుంచి జిల్లాకు వచ్చే వారితో బస్టాండ్‌లు కిటకిటలాడుతున్నాయి.

నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించను!

(5వ పేజీ తరువాయి)

మరో వ్యక్తుల పేరుతో సదరు భూమిని కొన్నట్లుగా రిజిస్ట్రేషన్ చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తప్పుడు రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. 432 సర్వే నెంబరులో అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని సదరు శాఖలను ఆదేశిస్తామని కలెక్టర్ చెప్పారు. 432సర్వే నెంబరులో రిజిస్ట్రేషన్ పేరుతో చేపట్టే అక్రమ కట్టడాలను నిలిపివేయాలని మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను ఆదుకోవాలని కలెక్టర్ రాజాబాబుకు సీఎస్‌పురం మండలానికి చెందిన ఇర్లా నీలమ్మ అనే మహిళ వేడుకుంది. సీఎస్‌పురం మండలం వడ్డెపాలెంకు చెందిన మోక్షిత, గౌతంకృష్ణల చిన్నప్పుడే తల్లి మతిస్థిమితం లేక ఎటో వెళ్ళిపోయిందని, తండ్రి ఇటీవల బేల్దారి పనిచేస్తూ బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందాడని పేర్కొన్నారు. చిన్నారులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి పథకాలు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మేనత్తనని సంరక్షకురాలిగా ధ్రువీకరణ పత్రం ఉంటే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు అర్హులు కాగలరని చెప్పారు. ఈవిషయమై ఎన్నిసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా కుదరదంటూ పంపించేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో కలెక్టర్ వెంటనే సంబంధిత శిశుసంరక్షణశాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను పిలిపించి వారి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

దివ్యాంగుల హాస్టల్‌లో అవినీతిపై ఫిర్యాదు

జిల్లా దివ్యాంగుల సంక్షేమ హాస్టల్‌లో సీనియర్ అసిస్టెంట్ గ్రంధి రవితేజ అక్రమాలు, అవినీతిని వెలికితీయాలని పొదిలి ప్రాంతానికి చెందిన నవ్యాంధ్ర దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు ముల్లా మదార్‌వలి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన అక్రమాలు, అవినీతి వివరాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 40 కుటుంబాలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా రాష్ట్రంలో చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై 40 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గిద్దలూరు మండలం తంబళ్లపల్లె గ్రామానికి చెందిన శీలం సాయిరామ్మోహన్‌రెడ్డితోపాటు అనుచరులు 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరినీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం అమలు చేసిన సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారని, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతుండడంతో తామంతా ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబులరెడ్డి, వైజా క్రిష్ణారెడ్డి, కటారు శ్రీను, కటారు క్రిష్ణ, గుండ్రెడ్డి రమణయ్య, జయరామిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



కనకదుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఒంగోలులోని ఏనుగుచెట్టు సెంటర్‌లో నగరోత్సవంలో ఓ కళాకారుడి విన్యాసం ఆకట్టుకుంది.


సరస్వతీదేవి అలంకారంలో చెట్టుమహాలక్ష్మమ్మ

సరస్వతీదేవిగా చెట్టుమహాలక్ష్మమ్మ

సింగరాయకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధి రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం కావడంతో రాత్రికి విద్యార్థుల చేత సరస్వతీ పూజ చేయించారు. వారికి వాసవీ క్లబ్ తరఫున పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లోని జాలమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శబరి ఎక్స్‌ప్రెస్.. ఇకపై సూపర్ ఫాస్ట్.!

నేటి నుంచి మారనున్న రైలు నంబర్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేండ్రం మధ్య నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ నేటి నుంచి సూపర్ ఫాస్ట్ రైలుగా మారనుంది. ప్రస్తుతం 17229/30 నంబర్లతో నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి 20629/30 నంబర్లతో పరుగులు పెట్టనుంది. గతంతో పోల్చుకుంటే రైలు వేగం పెరగడంతో ఆ రైళ్లలో ప్రయాణించే వారికి సుమారు 2 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. నిన్న, మొన్నటివరకు సికింద్రాబాద్ నుంచి రోజూ మధ్యాహ్నం 12.20గంటలకు బయల్దేరే శబరి ఎక్స్‌ప్రెస్ మరుసటి సాయంత్రం 6.05గంటలకు త్రివేండ్రంకు (29.45గంటల ప్రయాణం) చేరుకునేది. తాజాగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారాక ప్రతిరోజూ మధ్యాహ్నం 2గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయం త్రం 6.25గంటలకు (28గంటల్లో) చేరనుంది. అలాగే, ఇంతకుమునుపు త్రివేండ్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45గంటలకు సికింద్రాబాద్‌కు (30గంటల్లో) వచ్చే శబరి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్‌గా మారాక త్రివేండ్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు ఉదయం 11గంటల కల్లా(27.45గంటల్లోగా) చేరనుంది.

ప్రయాణికులపై 'సూపర్ పాస్ట్' బాదుడు.!

శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ కావడంతో ప్రయాణ సమయం 2గంటలు ఆదా అవుతుందని ఒకవైపు ఆనందపడుతున్న ప్రయాణికులు, మరోవైపు సూపర్ ఫాస్ట్ చార్జీల రూపేణా జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు అదనంగా రూ.15, స్లీపర్ ఏసీ తరగతుల టికెట్లపై రూ.30నుంచి 40వరకు అదనంగా చెల్లించాల్సి రావడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇప్పటివరకు దక్షిణమధ్యరైల్వే ఆధ్వర్యంలో ఉండే శబరి ఎక్స్‌ప్రెస్ నిర్వహణ (మెయింటెనెన్స్) బాధ్యతలను నేటినుంచి సదరన్ రైల్వే చేపట్టనుందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు.

నూజెళ్లపల్లిలో దసరా ఉత్సవాల నిర్వహణకు అనుమతి

దేవదాయశాఖ అధికారుల నిర్ణయం

స్వస్థివాచకం, గ్రామోత్సవంపై ఆర్డీవో, డీఎస్పీ సూచనలు

పంగులూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల మనోభావాలకు అనుగుణంగా నూజెళ్లపల్లి గ్రామంలో దసరా పర్వదిన సందర్భంగా దేవతలకు స్వస్థివాచకం, గ్రామోత్సవం నిర్వహించేందుకు అందరూ సహకరించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర నా యుడు, డీఎస్పీ మొయిద్దీన్ చెప్పారు. నూజెళ్లపల్లిలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకులైన చందలూరు వంశస్థులు, చల్లా వంశస్థుల మధ్య స్వస్థివాచకం నిర్వహణపై కొన్నేళ్లుగా వివాదం నెలకొనగా గ్రామంలో దసరా వేడుకలు నిలిచిపోయాయి. ఈ ఏడాది తమ గ్రామంలో పారువేట, గ్రామోత్సవం జరిపించాలన్న ప్రజల ఆకాంక్షల మేరకు రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖ అధికారులు ఆలయ అర్చకస్వాములు, చల్లావంశస్థులు కార్యక్రమం నిర్వహణపై పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వస్థివాచకం ఎవరు నిర్వహించాలి అనే విషయమై ఇరువురి వాదనలు విన్న అధికారులు దేవదాయశాఖ అధికారుల నిర్ణయం మేరకు ఉత్సవం నిర్వహణ చేపట్టాలని, అందుకు అందరూ సహకరించాలని సూచించారు. ఉత్సవం నిర్వహణలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, సీఐ పాల్గొన్నారు.


సమీక్ష చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, డీఎస్పీ మహమ్మద్‌మొయిన్


గుర్రం జాషువా జయంతిలో మాట్లాడుతున్న ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్ రాములు

ఘనంగా గుర్రం జాషువా జయంతి

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): విశ్వకవి గుర్రం జాషువా 130వ జయంతి కార్యక్రమం మాదిగజన సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రలో ఘనంగా జరిగింది. ప్రముఖ నాటక రచయిత డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్ డి.రాములు మాట్లాడుతూ సమాజంలోని బడుగు, బలహీన వర్గాల వారి సమస్యలను, అంటరానితనాన్ని జాషువా తన రచనల ద్వారా ఎలుగెత్తిచాటారన్నారు. ఆయన రచించిన గబ్బిలం, ఫిరదౌసి వంటివి ఇందుకు నిదర్శనమన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద రావు మాట్లాడుతూ 19వ శతాబ్దం చివరలో, 20వ శతాబ్దం ప్రారంభంలో సమాజంలో ఉన్న అంటరానితనాన్ని చూడటమే కాకుండా దాని ఫలితాన్ని కూడా గుర్రం జాషువా అనుభవించారని, దీంతో ఆయన బడుగు బలహీనవర్గాల పక్షాన ఎన్నో రచనలు చేసి విశ్వకవిగా గుర్తింపు పొందారన్నారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ గుర్రం జాషువా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపే దిశగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ చింతకింది కాశీం, గద్దల వెంకటేశ్వర్లు, ఏ.ప్రసాద్, సి.హెచ్.బాలకోటయ్య, కార్యనిర్వాహక కమిటీ ప్రతినిధులు అట్లూరి అమ్మయ్య, అట్లూరి రామవులు, నూతక్కి విజయ శేఖర్, పాలపర్తి జడ్సన్, గూడవల్లి లాజర్, పందింటి వీరాస్వామి, అట్లూరి ప్రసాద్, కొమ్ముల రవివర్మ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ఆందోళన

● సమస్యలను పరిష్కరించాలని డిమాండ్


ఆందోళన నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఒంగోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ధర్నాలో వేదిక నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు డోర్ టు డోర్ సర్వీసులు, సర్వేలు పూర్తి రద్దు చేయాలని, 21 విభాగాల్లో ఉన్న ఉద్యోగులందరినీ జిల్లా డీఎస్సీ ద్వారా మెరిట్ జాబితా తయారు చేసి అవకాశం ఉన్నంత వరకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల్లో టెక్నికల్ అంటూ ప్రొఫెషనల్ ఉద్యోగులకు గ్రేడ్-1,2,3 అనే విధానాన్ని రద్దు చేసి అందరికి డైరెక్టు డిసిగ్నేషన్‌తో గుర్తించాలని, ప్రస్తుతం ఇస్తున్న రికార్డు అసిస్టెంట్ స్కేలును తొలగించి కనీసం బేసిక్ అనేది జూనియర్ అసిస్టెంట్ స్కేలును అమలు చేయాలని, గతంలో బకాయి ఉన్న నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని కోరారు. వచ్చేనెల 2నాటికి ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికి స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, అదనపు డ్యూటీ ఇన్‌చార్జిగా చేసినప్పుడు వారికి ప్రత్యేక జీతం మంజూరు చేయాలన్నారు. సరెండర్ లీవ్స్‌ను వెంటనే క్యాష్ చేసుకోనే విధంగా అవకాశంకల్పించాలని, సచివాలయ ఉద్యోగులను వారివారి మాతృశాఖలు గుర్తించి వారి పరిధిలోనే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక టౌన్ అధ్యక్షుడు మహావిష్ణు, రాష్ట్ర చైర్మన్ ప్రభాకర్, జెఎసి నాయకులు చాంద్‌బాషా, రవిరెడ్డి, అంజి, భాస్కర్‌రెడ్డి, గౌస్‌బాషా, విజయలక్ష్మీ, భాగ్యలక్ష్మీ తదితరులు ఉన్నారు.

గ్రీనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సింగయ్య ప్రమాణ స్వీకారం

సింగరాయకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండలంలోని సోమరాజుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత వేల్పుల సింగయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో స్వర్గీయ ఎన్టీఆర్, దామచర్ల కాంస్య విగ్రహాలకు టీడీపీ నేతలతో కలిసి సింగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయవాడ బయల్దేరి వెళ్లారు. అక్కడ మురళి ఫార్చ్యూన్ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. సింగరాయకొండ మండలం నుంచి వెళ్లిన టీడీపీ నేతలు సింగయ్యను అభినందించారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న సింగయ్య

ఆర్‌డీటీ సంస్థకు విదేశీ నిధులు విడుదల చేయాలి

● చెంచు గిరిజనుల ర్యాలీ.. ● తహసీల్దారుకు వినతి


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న చెంచు గిరిజనులు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు తోడ్పాటు అందించే ఆర్‌డీటీ సంస్థకు విదేశీ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని చెంచు గిరిజనులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంఘం నాయకుడు భూమని మంతన్న ఆధ్వర్యంలో గిరిజనులు శివసదన్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అనంతరం తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతపురం, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పేదలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, జీవనోపాధి పెంపుదలకు సంస్థ తోడ్పాటును అందిస్తోందన్నారు. మండలంలోని చింతల, తుమ్మలబైలు గూడేల్లో 150 పక్కాగృహాలు నిర్మిస్తూ నిధులు రాకపోవడంతో అవి నిలిచి పోయాయన్నారు. నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోతన్న పాల్గొన్నారు.

సారొస్తారో.. రారో?

- కొత్త ఉపాధ్యాయుల కోసం ఎదురుచూపులు
- వైపాలెం నియోజకవర్గంలో అధికంగా ఉన్న ఖాళీలు
- కొన్నైనా భర్తీ అవుతాయనే ఆశలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు త్వరలో విధుల్లో చేరనున్నారు. వారిలో కొందరైనా మా ఊళ్లకు వస్తారో.. రారో.. అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న పశ్చిమ ప్రాంతంలోని ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా ఖాళీలు ఉండి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది.

త్రిపురాంతకం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గం మొత్తమ్మీద 486 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎర్రగొండపాలెం మండలంలో 159, పుల్లలచెరువు మండలంలో 138, త్రిపురాంతకంలో 89, పెద్దారవీడులో 20, దోర్నాల మండలంలో 80 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో జరిగిన బదిలీల కారణంగా ఖాళీల సంఖ్య పెరిగిపోయింది. ప్రస్తుతం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 40 పాఠశాలల్లో అసలు ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేక మూతవేయాల్సిన పరిస్థితి నెలకొంది. అందులో పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల్లోనే 25 వరకు ఉన్నాయి. కానీ వాటిని డిప్యూటేషన్ పద్ధతిలోనో, బదిలీపై వెళ్లిన వారిలో కొందరిని వెనక్కి రప్పించి అవి మూతపడకుండా సాగిస్తున్నారు.

తాజా డీఎస్సీ ద్వారా జిల్లాకు 661 మంది ఉపాధ్యాయులు నియామకం అయ్యారు. వీరికి వచ్చేనెల 3 నుంచి శిక్షణ ఇచ్చిన తరువాత 10వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా పాఠశాలలకు పంపనున్నారు. సమస్యంతా కౌన్సెలింగ్ సమయంలోనే జరుగుతుంది. పాఠశాలలు ఎంపిక చేసుకునే ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ సమయంలో ఎక్కువగా పట్టణ ప్రాంతాలు, రవాణా సౌకర్యాలు ఉన్న మండలాలు, ఇతర వసతులు ఉన్న ప్రాంతాలను కోరుకుంటారు. దీనివల్ల ప్రతిసారీ మారుమూల ప్రాంత మండలాల్లో ముఖ్యంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని పాఠశాలల్లో ఖాళీలు భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం వచ్చిన కొత్త ఉపాధ్యాయులు 106 మంది మాత్రమే సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. వారిలో ట్రైబల్ ఇతర పాఠశాలల్లో వారు పోగా మిగిలేది తక్కువ మంది మాత్రమే. ఈ కారణంగా ఎస్‌జీటీ పోస్టులు మండలానికి ఇద్దరేసి వచ్చినా కనీసం 10 మంది మాత్రమే వస్తారని అంచనా.

ఇక ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో స్కూల్ అసిస్టెంట్‌లలో ఎక్కువ మంది ఉండటంతో వారి నుంచి ఎక్కువ మంది ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి వస్తారనే ఆశ వ్యక్తమవుతుంది. జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లో ఈ ఖాళీలు తక్కువగా ఉన్న కారణంగా ఇక్కడకు వచ్చే అవకాశం ఉందని ఉపాధ్యాయ వర్గాలు చెప్తున్నారు. కనీసం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు వచ్చినా ఉన్న ఖాళీల్లో 40 శాతం భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. కౌన్సెలింగ్ సమయంలో జిల్లా కేంద్రానికి దగ్గరగా, పట్టణ ప్రాంత పాఠశాలలను ఎంపిక చేసుకుంటేనే ఇబ్బందులు అధికమవుతాయని కనీసం కొందరైనా తమ మారుమూల ప్రాంత పాఠశాలలకు వస్తే బాగుంటుందని ఈ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రైతులకు సమృద్ధిగా యూరియా

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన మేర యూరియా సిద్ధంగా ఉందని, అందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో గిద్దలూరు సొసైటీ బ్యాంక్ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందించే డీఏపీ, యూరియా ఎరువులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రైతులపై జగన్‌రెడ్డి మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. రూ.2,740 డీఏపీని సబ్సిడీపై రూ.1,350కి, రూ.2,150 విలువైన యూరియాను రూ.266కి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్యయాదవ్, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్యయాదవ్, గిద్దలూరు, రామాపురం సొసైటీ బ్యాంక్ చైర్మన్‌లు దుత్తా బాలీశ్వరయ్య, భవనం పుల్లారెడ్డి, పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు షానేషావలి, భవనం పుల్లారెడ్డి, దుంపా రమణరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

- మంత్రిని కోరిన ఇమాంలు, మౌజన్‌లు

గిద్దలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్‌లు, మౌజన్‌ల గౌరవ వేతన బకాయిల కోసం రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూఖ్‌ను కలిశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని మసీదుల్లో పని చేస్తున్న సుమారు 120 మంది ఇమామ్‌లు, మౌజన్‌లు, ముస్లిం మత పెద్దలు సోమవారం నంద్యాలకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లి మంత్రిని కలిశారు. 11 నెలలుగా గౌరవ వేతనాలు రాలేదని తెలిపారు. ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ఇమామ్‌లు, మౌజన్‌లు మంత్రిని కలిసి వినతిపత్రం అందచేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే వేతనాలను విడుదల చేయాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం ప్రతినిధులు చాంద్‌బాషా, సయ్యద్ పీర్‌ఖాన్, హుస్సేన్‌ఖాన్ ఉన్నారు.

21 వరకు స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓఎన్‌జీసీ 2025-26 విద్యాసంవత్సరానికి 21 క్రీడా విభాగాల్లో స్త్రీ, పురుష క్రీడాకారులకు అందించే స్కాలర్‌షిప్‌లకు క్రీడాకారులు వచ్చేనెల 21వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఓఎన్‌జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. క్రీడాకారులకు నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఉపకార వేతనం ఇస్తారు. 15 నుంచి 20 సంవత్సరాల వయస్సు కలిగి కుటుంబ వార్షిక ఆదాయం ఐదులక్షల లోపు ఉన్నవారు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. 250 మంది ఉత్తమ క్రీడాకారులకు ఉపకారవేతనం ఇస్తారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఓఎన్‌జీసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ స్కాలర్‌షిప్ వివరాలు తెలుసుకొని దరఖాస్తులు చేసుకోవాలి. క్రీడాకారులు ఎవ్వరైనా నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే దరఖాస్తును తిరస్కరించడంతో పాటు వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆప్రకటనలో హెచ్చరించారు.

ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఎక్సైజ్ తనిఖీలు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఎక్సైజ్‌శాఖ తనిఖీలు నిర్వహించింది. సోమవారం ఒంగోలులో ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి ఎన్‌డీపీఎస్ లిక్కర్ వస్తుందనే అనుమానంతో ఈ తనిఖీలు నిర్వహిచారు. అక్కడ రికార్డులు పరిశీలించారు. పార్శిళ్లను చూశారు. నగరంలోని ఏనుగు చెట్టు వద్ద ఉన్న పార్శిల్ కార్యాలయంతోపాటుగా శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు చేశారు.

శిక్షణ పూర్తి చేసిన వారికే డీఎస్సీ పోస్టింగ్‌లు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన వారిలో కొత్త టీచర్లకు శిక్షణ పూర్తిచేసిన తర్వాతే నియామకపు ఉత్తర్వులు జారీ చేస్తామని పాఠశాల విద్యా డైరెక్టర్ విజయరామరాజు స్పష్టం చేశారు. సోమవారం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అక్టోబరు 3 నుంచి 10 వరకు జిల్లా కేంద్రాల్లో నిర్వహించే కొత్త టీచర్ల శిక్షణకు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అన్ని వసతులున్నాయో లేదో పరిశీలించాలన్నారు. కొత్త టీచర్లు ఎవ్వరైనా ఏదైనా కారణంతో శిక్షణకు మినహాయింపు కోరితే అనుమతించాలని, వారికోసం తర్వాత మళ్లీ శిక్షణ ఇస్తామన్నారు. అయితే శిక్షణ పూర్తి చేయని కొత్త టీచర్లకు నియామకపు ఉత్తర్వులు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కొత్త టీచర్లకు ప్రాథమిక శిక్షణ తప్పనిసరి అని అన్నారు. డీఎస్సీలో ఎంపికైన కొత్త టీచర్ల నియామకంలో టీచర్లు లేని పాఠశాలలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జూన్‌లో జరిగిన బదిలీల్లో ఏదైనా పాఠశాలలో అక్కడి టీచర్లందరూ బదిలీపై ఇతర పాఠశాలలకు వెళితే ఆ పాఠశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. బదిలీల్లో ఇతర పాఠశాలలు కోరుకోని రిలీవర్ రాని కారణంగా అదే పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను రిలీవ్ చేసి వారి స్థానంలో కొత్త టీచర్లను నియమించాలన్నారు. కొత్త టీచర్లను కేటగిరీ 3,4 ప్రాంతాల్లోనే ప్రాధాన్యతా క్రమంలో నియమించాలని విజయరామరాజు ఆదేశించారు. సెప్టెంబరు 30 నాటికి ఖాళీలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఖాళీల వివరాలను పెట్టాలని డైరెక్టర్ ఆదేశించారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి

- జేసీ గోపాలకృష్ణ పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు ఫలాలు ప్రజలకు చేరేలా అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. జీఎస్టీ తగ్గింపుపై ఏర్పాటు చేసిన ర్యాలీని స్థానిక కలెక్టరేట్ ఎదుట జేసీ గోపాలకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ వద్ద నుంచి అద్దంకి బస్టాండు వరకు జరిగింది. ఈ ర్యాలీలో మెప్మాలోని పొదుపు సంఘాల మహిళలు, వివిధ వాణిజ్య సంఘాల ప్రతినిధులు, ప్రజలు ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరుతో నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ ర్యాలీ చేపట్టామన్నారు. నాలుగు వారాల పాటు చేపట్టే ఈ కార్యక్రమాలను ఒక్కొక్క అంశంతో ప్రజల్లోకి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు.

పొగాకు సాగును తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్

కొండపి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు పొగాకును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక వేలం కేంద్రంలో పెట్లూరు క్లస్టర్ రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు నారు దశ నుంచే నాణ్యమైనది ఎంపిక చేసుకోవాలన్నారు, బోర్డు అనుమతించిన విస్తీర్ణంలో మాత్రమే పంట సాగు చేయాలని స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో వ్యాపార కంపెనీల ప్రతినిధులు దినేష్, అనిల్‌కుమార్, వై.లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- అందుకోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న యంత్రాంగం
- కలెక్టర్ రాజాబాబు

కనిగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. సోమవారం స్థానిక పవిత్ర ఫంక్షన్ హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి అర్జీలను స్వీకరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయలానే ఆలోచనతో ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి ససమ్యల పరిష్కారం దిశగా పయనిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా వైశాల్యం పెద్దదన్నారు. ప్రతి సోమవారం జిల్లాలో నిర్వహించే గ్రీవెన్స్‌కు ప్రజలు రావాలంటే వ్యయప్రయాసాలకు లోనౌతున్నట్లు చెప్పారు. ఎంతో సమయాన్ని, డబ్బును వృధా చేసుకుంటున్నట్లు చెప్పారు. అందుకే ఈ సమస్యను గుర్తించి ప్రజాశ్రేయస్సు కోసం డివిజన్ కేంద్రాల్లో గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో ప్రజలకు దగ్గరగా ఉండి వారికి భరోసా నమ్మకాన్ని కల్గించటమే తమ ఉద్దేశ్యమన్నారు. జిల్లా అధికారులు మంచి ఆలోచనతో ప్రజల సమస్యలు పరిష్కరించటమే లక్ష్యంగా నడుచుకోవాలన్నారు. కనిగిరిలో జరిగిన గ్రీవెన్స్ నిర్వహణలో ఎమ్మెల్యే సహకరించిన తీరు ఎంతో గొప్పదన్నారు. ఆయన ప్రోత్సాహంతో ప్రజలు చైతన్యంతో ముందుకువచ్చి తమ సమస్యలను విన్నవించుకోవటం మంచి పరిణామమన్నారు. కనిగిరి రెవిన్యూ డివిజన్ పరిధిలోనే 814 అర్జీలు నమోదయ్యాయన్నారు. సమస్యలు తీరిపోతాయమే నమ్మకంతో ఫిర్యాదుదారులే నేరుగా వచ్చి తమ వినతి పత్రాలను అందచేయటం వెనుక ఇక్కడి యంత్రాంగం, ప్రజాప్రతినిధుల చొరవ అభినందనీయమన్నారు. నమోదైన అర్జీలలో 60శాతం రెవిన్యూ సంబంధమైన సమస్యలేనన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, జిల్లా రెవిన్యూ అధికారి చిన ఓబులేషు, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన కలెక్టర్ రాజాబాబు

కనిగిరి ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన కలెక్టర్

కనిగిరి ప్రభుత్వాసుపత్రిని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి కలెక్టర్ రాజాబాబు సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని కంగారు మదర్‌కేర్ యూనిట్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలోని వసతులు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసూతి వార్డు, జనరల్ వార్డు, ఆపరేషన్ థియేటర్‌లు పరిశీలించారు. కంగారు మదర్‌కేర్ విభాగంలో ఉన్న బాలింతలతో ముచ్చటించారు. కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రయివేటు ఆసుపత్రులు కంటే ఎంతో శుభ్రంగా, అన్ని సౌకర్యాలు ఉన్నాయని బాలింతలు తెలపటంతో కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో పీసీపల్లి మండలంలోని దివాకరపల్లిలో ఏర్పాటుచేసిన రిలయన్స్ బయోగ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్ రాజాబాబు ప్రతినిధులతో సమీక్షించారు.

గుండె వ్యాధులపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- జీజీహెచ్‌లో ఘనంగా వరల్డ్ హార్ట్ డే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో రోజురోజుకు గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయని, వాటి నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుని అవగాహన కల్పించాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ సూచించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఒంగోలులోని జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న పోటీతత్వం, ఆహారపు అలవాట్లు, సరిగాలేని జీవన విధానంతో వ్యాధులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా గుండెపోటు మరణాలు పెరగడం బాధకరం అని అన్నారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి గుండె సంబంధిత మరణాలు తగ్గించాలన్నారు. ఒంగోలు జీజీహెచ్‌లో గుండె చికిత్స విభాగం ఆధునిక వైద్య పరికాలతో అందుబాటులో ఉందన్నారు. అత్యంత ఖరీదైన స్టంట్‌లు, అలాగే ఈసీజీ, టూడీ ఎకో, యాంజియోగ్రామ్ తదితర పరికరాలతోపాటు అనుభవం కలిగిన నిపుణులైన కార్డియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారని అన్నారు. పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్ మరింత ఉపయోగకరంగా ఉందన్నారు. జీజీహెచ్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. బెంగుళూరు. విజయవాడ, చెన్నై, హైదరబాదు వంటి నగరాలకు వెళ్ళకుండా అవసరమైన ఆధునిక వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్డియాలజిస్ట్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 11న జీజీహెచ్‌లో కార్డియో విభాగం ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. వారానికి సుమారు 300 మంది వరకు గుండెసంబంధిత సమస్యలతో విచ్చేస్తున్నట్లు తెలిపారు. అందులో ఇప్పటి వకు 27,642 మందికి టుడీ ఎకో పరీక్షలు చేయడం జరిగిందని, 1466 మందికి ఐసీయూ అడ్మిషన్‌లు రావడంతోపాటు, 251 కరోనరీ యాంజియోగ్రామ్, 11 కరోనరీ యాంజియో ప్లాస్టీ చేయడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందిస్తామని తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించడం కోసం జీజీహెచ్‌లో ఆధునిక వైద్య పరికరాలు, అనుభవం కలిగిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏటీ అద్దయ్య, సీఎస్ఆర్ఎం. డాక్టర్ మధవీలత, తదితరులు పాల్గొన్నారు. అంతకముందు జీజీహెచ్ నుంచి కలెక్టరేట్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గోశాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం

మార్కాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గోశాలను దాతలు, ప్రభుత్వ సహకారంతో సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. కొండేపల్లి రోడ్డులో గోశాల కోసం కేటాయించిన స్థలంలో సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా క్రతువును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఆవుల వలన ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సరైన ఆహారం లేక గోవులు అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. వాటి సంరక్షణకు ఇప్పటికే కొండేపల్లి రోడ్డులో కేటాయించిన స్థలంలో గోశాల నిర్మాణం అందరి సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, చెన్నయ్య ఆలయ ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, సాగునీటి సంఘం అధ్యక్షులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, జనసేన నాయకులు పిన్నెబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.


గోశాలకు భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సప్లై చానల్‌లో పూడికతీత

మార్కాపురం చెరువు సప్లై చానల్‌లో పూడికతీత పనులను ఇరిగేషన్ అధికారులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి ఆనుకునివున్న చెరువు సప్లై చానల్‌లో చెత్తాచెదారం నిండిపోవడంతో వర్షాకాలంలో చెరువులోకి నీరు చేరేందుకు ఇబ్బందిగా మారుతోందన్నారు. దీంతో పూడికతీత పనులు చేపట్టినట్లు చెప్పారు. నీటి సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఎమ్మెల్యే నారాయణరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మార్కాపురంతోపాటు డివిజన్‌లోని పలు సమస్యలపై చర్చించారు.


సీసీఆర్‌టీ డైరెక్టర్ రాజీవ్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఉపాధ్యాయురాలు మంజుల

ఢిల్లీలో ఉపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల నుంచి ఎస్సీఈఆర్టీద్వారా ఎంపిక చేసిన 68 మంది ఉపాధ్యాయులకు రోల్‌ఆఫ్ పప్పెట్రీ ఇన్ ప్రైమరీ ఎడ్యుకేషన్‌పై శిక్షణ నిర్వహించారు. ఈనెల 10నుంచి 24వతేదీ వరకుజరిగిన ఈ శిక్షణలో నాగులుప్పలపాడు ఎంపీపీఎస్ నుంచి ఉపాధ్యాయురాలు వై. మంజుల పాల్గొన్నారు. ఈ శిక్షణలో ప లు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో రాష్ట్ర సాంస్కృతిక వారసత్వ సంపద, గొప్పదనం, అవతరణ, సంప్రదాయాలు, కళలు, మహానుభావులు, ఒంగోలు గిత్త తదితర అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. సీసీఆర్‌టీ డైరెక్టర్ రాజీవ్‌కుమార్ చేతుల మీదుగా ఉపాధ్యాయురాలు మంజుల సర్టిఫికెట్‌ను అందుకున్నారు.


అల్లూరు గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దోమల నివారణతోనే వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట

కొత్తపట్నం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):దోమలను అరికట్టం ద్వారా డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటి వాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా మలేరియా అధికారి మధుసూదనరావు అన్నారు. సోమవారం మండలంలోని అల్లూరు గ్రామంలో జరిగిన ఫీవర్ సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన ఆయన దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి గ్రామస్థులకు వివరించారు. చైతన్య నర్సింగ్ కళాశాల విద్యార్థినులు మలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ వ్యాధుల గురించి వివరించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను వారు సేకరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఓంకార్, సబ్‌యూనిట్ ఆఫీసర్ సాగర్, సూపర్‌వైజర్ ప్రభాకర్, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌వో, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మద్దిపాడులో హోటల్ యజమాని శ్రీనివాసరావుతో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

చంద్రబాబుతోనే అభివృద్ధి

మద్దిపాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదరావు అన్నారు. సోమవారం మద్దిపాడు వీరభద్ర హోటల్ యజమాని పప్పు శ్రీనివాస రావును ఆయన కలిసిన సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి పరుగులు పెడుతున్నాయన్నారు. అమరావతి శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వర రావు, మాజీ సర్పంచ్ జజ్జర శరత్ బాబు, ఉండవల్లి సుధాకర్ రావు, చుంచు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను బెదిరిస్తున్న వారిపై అట్రాసిటి కేసును నమోదు చేయాలి


బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న హైకోర్టు న్యాయవాది చైతన్య

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : ఒంగోలు మండలం బొద్దులూరిపాలెంలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసులో బాధితులను బెదిరిస్తున్న నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని హైకోర్టు న్యాయవాది, మాలయువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య డిమాండ్‌చేశారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

వివాదాన్ని పరిష్కరించిన అధికారులు

కొత్తపట్నం,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈతముక్కల చెంచుపాపాయ పట్టపుపాలెంలో నెల కొన్న వివాదాన్ని అధికారులు పరిష్కరించారు. సోమవారం చెంచుపాపాయ పట్టపుపాలేన్ని తహసీల్దార్ శాంతి, ఎస్ఐ సుధాకర్ వేర్వేరుగా సందర్శించారు. చెంచుపాపాయ పట్టపుపాలెంలో ఒక కుటుంబాన్ని బహిష్కరించారంటూ వచ్చిన వార్తలపై అధికారులు స్పందించారు. తహసీల్దార్ శాంతి, ఎస్ఐ సుధాకర్ గ్రామంలో పర్యటించి ముందుగా మాజీ సర్పంచి ప్రసాదు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జరిగిన సంఘటన పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ కాపులతోకూడా వారు చర్చించారు. కాపులు తెలిపిన వివరాల మేరకు ప్రసాదు కుటుంబం గ్రామం ఉమ్మడి డబ్బుల నుంచి తీసుకున్న అప్పును తిరిగి చెల్లించమని అడిగితే దురుసుగా సమాధానం చెప్పాడని తెలిపారు. దీనిపై ఎస్ఐ కాపులకు తగిన సూచనలు చేశారు. ఇంటికి తాళాలు వేయటం సరికాదన్నారు. రుణాన్ని ప్రసాదు తిరిగి చెల్లిస్తారని చెప్పారు. గ్రామ బహిష్కరణ వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని గ్రామస్థులకు అధికారులు హితవుపలికారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలనుంచి వస్తున్న అర్జీలు పునరావృతంకాకుండా అధికారులు సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలను విన్నవించారు. తన పరిధిలో ఉన్న అర్జీలన ఏవీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని పరిశీలించారు. మరికొన్నింటిపై విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ప్రజల నుంచి అర్జీలు పునరావృతం అయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే 227 అర్జీలు ఆయా శాఖలలో పునరావృతం అయ్యాయన్నారు. నిబంధనల ప్రకారం సరైనవో కావో పరిశీలించాలన్నారు. లేకుంటే అర్జీదారులకు వివరించాలని


మీకోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

తెలిపారు గడువు మీరిన అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, మాధురి, విజయ జ్యోతి కుమారి తదితరులు ఉన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 105 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం : ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే విచారించి చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీవి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 105 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో నేరుగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని వారు సంబంధిత పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయం, సబ్‌డివిజన్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ వీవీ రమణకుమార్, సీఐలు శ్రీకాంత్ బాబు, వెంకటేశ్వర్లు,సుబ్బారావు, సోమశేఖర్ ఎస్ఐ జనార్దనరావు పాల్గొన్నారు.

నూతన జీఎస్టీ విధానంతో పేదలకు మేలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ విధానంతో పేద,మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్,వెలుగు కార్యాలయంలో అధికారులతో నూతన జీఎస్టీ పాలసీతో ప్రజలకు కలిగే లబ్ధిపై వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అక్టోబరు 18 నుంచి అన్ని గ్రామ పంచాయతీలలో నూతన జీఎస్టీ పాలసీని ప్రజలకు కలిగే లబ్ధిపై ఇంటింటి ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం మండల కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అధికారులతో కలిసి జీఎస్టీ అవగాహన ర్యాలీ చేశారు. మానవహారం చేశారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ టి.ఏడుకొండలు, డిప్యూటీ ఎంపీడీవో మురళీమోహన్, ఏపీవో రవిబాబు, ఏపీఎం బత్తుల నరేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరవదిలో..

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గుదలతో పలు వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని , దీని గురించి ప్రజలు తెలుసుకోవాలని ఎంపీడీవో కె .రాజశేఖరరావు అన్నారు. ఒంగోలు మండలం కరవది గ్రామపంచాయతీ కార్యాలయంలో జీఎస్టీపై డ్వాక్రాగ్రూపు మహిళలకు అవగాహన కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దుకాణాలలో వస్తువులు కొనుగోలు చేసే సమయంలో జీఎస్టీ అడిగి తెలుసుకొని కొనుగోలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు

ఎస్ఎన్‌పాడులో అవగాహన సదస్సు

సంతనూతలపాడు : స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై సంబంధిత అధికారులకు, పంచాయతీ కార్యర్శులకు, సచివాలయం సిబ్బం



నాగులుప్పలపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో రవికుమార్,అధికారులు

దికి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శివరాం అవగాహన కల్పించారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని, దుకాణాల వద్ద జీఎస్టీ తగ్గింపు బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది జీఎస్టీ గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ రమణమ్మ, పలువురు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

చీమకుర్తి మున్సిపాల్టీలో ఇక 27 వార్డులు

మార్పులు,చేర్పులతో ముసాయిదా జాబితా విడుదల

అభ్యంతరాల స్వీకరణకు వారం వరకు గడువు

చీమకుర్తి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు చీమకుర్తి మున్సిపాల్టీ పరిధిలో వార్డుల పునర్విభజన కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ అధికారులు పూర్తిచేశారు. నిబంధనలు మేరకు మున్సిపాల్టీ పరిధిలో 20 నుంచి 27కు వార్డులు సంఖ్య పెరిగిన నేపథ్యంలో తదనుగుణంగా ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి పునర్విభజన ప్రక్రియ పూర్తిచేసి ముసాయిదా జాబితాను సోమవారం కమిషనర్ వై.రామకృష్ణయ్య విడుదల చేశారు.ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అక్టోబరు ఆరో తేదీ


వార్డుల పునర్విభజన ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య, అధికారులు

లోపు మున్సిపల్ కార్యాలయంతో పాటు ఆయా వార్డుల పరిధిలోని సచివాలయాల్లో రాతపూర్వకంగా,వివరణాత్మకంగా,ఆధారాలతో తెలియజేయాలని రామకృష్ణయ్య తెలిపారు.

కాగా పట్టణంలో వార్డుల పునర్విభజనతో గతంలో ఉన్న వార్డుల సంఖ్యతో పాటు ముఖచిత్రమే మారనుంది.పట్టణానికి ఉత్తరం వైపునుంచి సర్వే నంబర్ 741 నుంచి ఒకటో వార్డు ప్రారంభం కానుంది. చివరి వార్డు అయిన 27వ వార్డు గరికమిట్ట చెరువు ఉన్న ప్రాంతమైన సర్వే నంబర్ 723 తో ముగించనుంది. గతంలో ఉన్న వార్డుల సంఖ్యతో పాటు ప్రాంతం కూడా మారనుంది.వార్డుల పునర్విభజన ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగా నిర్వహించామని కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు.ప్రక్రియ ఆసాంతం పారదర్శకంగా నిర్వహించామన్నారు. ప్రతి వార్డులో అటుఇటుగా 850 మంది ఓటర్లు ఉండే విధంగా 27వార్డులను పునర్విభజన చేశామని వివరించారు. గతంలో వార్డుకు 1200మంది వరకూ ఓటర్లు ఉండేవారు.

రైతులకు ఎరువుల పంపిణీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట 42వ డివిజన్ సుందరయ్య కాలనీలో సోమవారం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. రైతులకు కూటమిప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కందుకూరి బాబు, నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, అబ్బూరి శ్రీనివాసరావు, వివరం గోవిందు, టీడీపీ, జనసేన నాయకులు, మండల వ్యవసాయాధికారి పి.పావని, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

యూరియా, నల్లబర్లీపై రైతులకు అవగాహన

మండలంలోని పేర్నమిట్ట గ్రామంలో సోమవారం రైతులకు యూరియా అవుట్ రీచ్, నల్లబర్లీ పొగాకుపై మండల వ్యవసాయాధికారి పి.పావని అవగాహన కల్పించారు. పంటలకు రసాయనిక ఎరువులను తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులను, జీవరసాయనిక ఎరువులను వినియోగించాలని సూచించారు. భూసారఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలన్నారు. రబీ సీజన్‌లో సాగుచేయబోయే పంటలకు మందస్తుగానే ఎరువులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రబీసీజన్‌లో నల్లబర్లీ పొగాకు సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈవో సుబ్బారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

పొన్నలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, జడ్పీటీసీ సభ్యుడు బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత హాజరయ్యారు. ఎంపీపీ మాధవరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికీ అందాలన్నారు. అందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. చెరుకూరు పీఏసీఎస్ చైర్మన్ వడ్డే మాల్యాద్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కౌలు కార్డు మీద పంటల బీమా విషయంలో అవినీతి చోటు చేసుకుందని సమావేశం దృష్టికి తెచ్చారు.

కె.అగ్రహారం సర్పంచ్ షేక్ చిన్న మస్తాన్ మాట్లాడుతూ గ్రామం నుంచి మాలకొండ దేవస్థానానికి ప్రతి శనివారం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఇతర ప్రజా సమస్యలను ఎవ్వరూ ప్రస్తావించలేదు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల్లో ఎక్కువ మంది హాజరు కాలేదు. దీంతో గంటలోనే సమావేశం ముగిసింది.

చైనా నిర్ణయం చారిత్రాత్మకం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులపై ఇప్పటివరకు అమలులో ఉన్న 30 శాతం దిగుమతి సుంకాన్ని చైనా ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేయడం శుభపరిణామమని ప్రముఖ రసాయనశాస్త్రవేత్త, ఎస్ఆర్పీ ల్యాబరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇకపై దేశానికిచెందిన ఔషధ ఉత్పత్తులను ఎటువంటి దిగుమతి సుంకం లేకుండా చైనాకు ఎగుమతి చేసే అవకాశం లభించడం ద్వారా భారత ఫార్మా పరిశ్రమకు కొత్త అవకాశాలు వచ్చినట్లు అయ్యిందన్నారు. చైనా తీసుకున్న నిర్ణయం భారత కంపెనీలకు బలమైన మార్కెట్‌గా నిలుస్తుందన్నారు.

దాడులను అరికట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మాలలపై జరుగుతున్నదాడులను ప్రభుత్వం అరికట్టాలని మాల జేఏసీ జిల్లా చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు డిమాండ్ చేశారు. స్థానిక జేఏసీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు మాలలను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

పీహెచ్‌సీ ఆవరణలో వ్యర్థాల తొలగింపు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతా సేవ కార్యక్రమంలో భాగంగా టంగుటూరు పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక పీహెచ్‌సీ ఆవరణను సోమవారం శుభ్రం చేశారు. వ్యర్థాలను తొలగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

పోషకాహారంపై అవగాహన

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలేటిపాడులో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై సోమవారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం వలన ఒనగూరే ప్రయోజనాలను సీడీపీవో మల్లీశ్వరి వివరించారు. జరుగుమల్లి సెక్టార్ సూపర్‌వైజర్ పి.భారతి పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారు

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీచెన్నకేశవ స్వామివారి దేవాలయంలో శరవన్నరాత్రులలో భాగంగా సోమవారం శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారిని శ్రీసరస్వతీ దేవిగా అలంకరించారు. అమ్మవారిని విద్యార్థులు ఎక్కువసంఖ్యలో దర్శించుకున్నారు. పలువురు చిన్నారులకు ప్రత్యేక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

మద్దిపాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):మహిళను వేధింపులకు గురిచేస్తున్నాడన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు మద్దిపాడు ఎస్సై వెంకట సైదులు సోమవారం తెలిపారు. నాగన్నపాలెంకు చెందిన పూజితకు చంద్రపాడుకు చెందిన వెంకటేష్ శ్రీకాంత్‌తో వివాహం అయ్యింది. పుట్టింటి నుంచి అత్తవారింటికి వచ్చిన కొన్ని రోజులు ప్రశాంతంగా జీవనం సాగించామని, తరువాత తన భర్త శ్రీకాంత్ వెంకటేష్, అత్తమామలు శ్రీను, నాగమ్మ వేధింపులకు గురిచేస్తున్నారని పూజిత ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామన్నారు.

గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు

తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు.

దిగజారుతున్న పొగాకు ధరలు

● నష్టాలు తప్పవంటున్న రైతులు

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): పొగాకు ధరలు రోజురోజుకు దిగజారటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో నష్టాలు తప్పవని రైతులంటున్నారు. సోమవారం ఒంగోలు పొగాకు వేలంకేంద్రం రెండులో జరిగిన వేలంలో నాణ్యమైన పొగాకును కేజీ ధర 336రూపాయలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. లోగ్రేడ్ పొగాకును కేజీ 86రూపాయలకు కొనుగోలు చేశారు. నాలుగు ఐదురోజులు క్రితం పొగాకు ధర కేజీ గరిష్ఠ ధర 346రూపాయలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. లోగ్రేడ్‌లు కూడా రోజురోజుకు వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేయటంతో రైతులు పాలుపోని స్థితిలో ఉన్నారు. సోమవారం జరిగిన వేలంలో మొత్తం 1,515 బేళ్లు రాగా 1,350 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 114 బేళ్లు నోబిడ్‌లు అయ్యాయి.

2న మల్లవరం కల్యాణకట్ట, వసతిగృహాలకు ప్రారంభోత్సవం

మద్దిపాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):మల్లవరం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో కల్యాణకట్ట వసతి గృహ ప్రారంభోత్సవం అక్టోబర్ 2వ తేదీన జరుగుతుందని శ్రీవారివనం అధ్యక్షుడు మార్నేని కృష్ణారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఒంగోలులో జరిగిన మీడియా సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవ అధ్యక్షుడు కావూరి వాసు, అధ్యక్షుడు మార్నేని కృష్ణారావులు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట, శ్రీవారి సదనం, వసతి గదులను దాతల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. భక్తుల తలనీలాలను సమర్పించు కోవడానికి కేశఖండనశాల, ఉత్తరం వైపున నక్షత్ర వలయం రాశి వనం, దేవత వృక్షాలు తదితరాలను అభివృద్ధి చేశామన్నారు. రానున్న రోజుల్లో పర్యాటక శాఖ, ప్రైవేటు సంస్థల సహకారంతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. రెండో తేదీ జరిగే కార్యక్రమానికి ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.

సరస్వతీ నమస్తుభ్యం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకుని మూలనక్షత్రం సందర్భంగా మార్కాపురం పట్టణంలో అమ్మవార్లు సోమవారం వివిధ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు రాజ్యలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్ ఉత్సవ మూర్తికి అభిషేకాలు, అలంకరణ నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు విద్యాలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ కాళరాత్రి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను పర్యవేక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొంతల పుల్లారావు, కార్యదర్శి వక్కలగడ్డ సురేశ్ కుమార్, కోశాధికారి చక్కా మాలకొండ చిన్న నరసింహారావు కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద పంపిణీ నిర్వహించారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. జవహర్ నగర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో విద్యాలక్ష్మీ అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు.

త్రిపురాంతకం : త్రిపురాంతకేశ్వరస్వామి శ్రీమత్ బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మూలానక్షత్రం కావడంతో విశిష్టత కారణగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సరస్వతీదేవి పూజ జరగడంతో పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సోమవారం కాళరాత్రి అమ్మవారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


కంభం, రాచర్లలో సరస్వతీదేవిగా


విద్యాలక్ష్మిగా రాజ్యలక్ష్మి


పట్టు వస్త్రాలు సమర్పించి పూజలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

బాలాత్రిపురసుందరీదేవికి టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పట్టు వస్త్రాలను సమర్పించి పూజలో పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. సరస్వతీ పూజ చేసిన భక్తులు చాలామంది వారి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అనిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

గిద్దలూరు : గిద్దలూరులో దసరా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అమ్మవారిశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీ నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు చీతిరాల ప్రసాద్ అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులకు విద్యాసామాగ్రిని అందించారు. రామాలయం నుంచి అమ్మవారిశాల వరకు కన్యకలు కలిశాలను ఎత్తుకుని రాగా అమ్మవారికి ఆ నీటితో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతలు ప్రత్యేక పూజలు చేశారు. షరాఫ్ బజారులోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాచర్ల : అమ్మవారు సోమవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టాభి రామాలయంలో అమ్మవారిని సరస్వతీ దేవి అలంకరించి పూజలు నిర్వహించారు.

కంభం : శ్రీ కోట సత్యమాంబ దేవి అమ్మవారు శ్రీ సరస్వతి దేవిగా, వాసవీ మాత సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.


కంభం ప్రభుత్వాసుపత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

ఆరోగ్యం..విద్యపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌరుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం కంభం ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలోని ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ వరకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజారోగ్యంపై దృష్టి సారించారన్నారు. గిద్దలూరులో వందపడకల వైద్యశాల, కంభంలో 50పడకల ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు ఆయన కంభం వైద్యశాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ శిరీష ప్రియదర్శిని, డాక్టర్ శివనాయక్, ప్రత్యేకాధికారి వంశీకృష్ణ, ఎంపీడీవో వీరభద్రాచారి, కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల టీడీపీ, జనసేన, బిజేపీ నాయకులు పాల్గొన్నారు.



డీఎస్సీపై మాట నిలబెట్టుకున్న సీఎం

కొత్త ఉపాధ్యాయుల సన్మానంలో ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీని పూర్తి చేశారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో డీఎస్సీ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 94 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. కొత్తగా వస్తున్న ఉపాధ్యాయులు ప్రతిభతో పాఠశాలలకు, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరిసుబ్బారావు, ఎంఈవో ఆంజనేయులు, నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీను పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎరిక్షన్‌బాబు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

36 మందికి వైద్య ఖర్చుల కోసం రూ.26,39,242లక్షలు సీఎం సహాయ నిధి చెక్కులను ఎరిక్షన్‌బాబు అందజేశారు. త్రిపురాంతకం, పుల్లలచెరువు మండల పార్టీ అధ్యక్షులు మేకల వళరాజు, పోట్ల గోవింద్ పాల్గొన్నారు.

యాదవ సంఘ కార్యాలయం ప్రారంభం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన యాదవ సంఘ నూతన కార్యాలయాన్ని మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య యాదవ్, బేస్తవారపేట జడ్పీటీసీ సభ్యుడు బండ్లమూడి వెంకటరాజు యాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా యాదవ సంఘ నాయకులు కొత్తకోట పోలయ్యయాదవ్ మాట్లాడుతూ బీఈడీ కళాశాల ఆవరణలో కళాశాల అధినేత బుడత తిమ్మయ్యయాదవ్, ఆయన కుమారుడు హరికిషన్ యాదవ్ కళాశాల ఆవరణలో 20 సెంట్ల స్థలాన్ని కార్యాలయానికి ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.


కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సంఘ నాయకులు

సొసైటీ బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జువ్వాజి

మార్కాపురం రూరల్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి) : సొసైటీ బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ జవ్వాజి రామాంజులరెడ్డి కోరారు. నెహ్రూ బజారులోని సొసైటీ బ్యాంక్‌లో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. రుణాలు కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని జువ్వాజి సూచించారు. గతంలో రుణం తీసుకున్న వారు వడ్డీ చెల్లించాలన్నారు. సమావేశంలో డైరెక్టర్‌లు తిరుమలరెడ్డి వెంకటరెడ్డి, ఏలూరి వెంకటకోటిరెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బొప్పరాజు కాశయ్య, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పెద్దదోర్నాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని చిన్నదోర్నాల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను సోమవారం నిర్వహించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను వైద్యాధికారి లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పరిశీలించారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాగేంద్ర, రాధ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గిద్దలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలకొండపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి గురువులను సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ నారాయణరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పి.రమణరెడ్డి, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


నారాయణరెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

రాచర్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు విన్నామని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎస్.వెంకట రామిరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ షేక్ ఖాశింబీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, వ్యవసాయ అంతర్గత రోడ్లు, పింఛన్‌లు తదితర సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. వాటిపై ఎంపీడీవో స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో




డైరెక్టర్‌గా నియామకపత్రాన్ని అందుకుంటున్న చెన్నకేశవులు

విద్య, వైద్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా చెన్నకేశవులు ప్రమాణ స్వీకారం

కంభం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏపీ విద్య, మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా కంభం మండలానికి చెందిన రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోన చెన్నకేశవులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. గోన చెన్నకేశవులును కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. సోమవారం అమరావతి రావాల్సిందిగా సమాచారం అందడంతో ఆయన అమరావతి వెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం చెన్నకేశవులు మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా దళిత సామాజిక వర్గానికి చెందిన తనకు ఈ పదవి వచ్చేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

రాచర్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తగ్గిన జీఎస్టీ రేట్లు మహిళా సాధికారతకు బాటలు వేస్తాయని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. జీఎస్టీ తగ్గింపు, ప్రయోజనాలపై సోమవారం అన్ని శాఖల అధికారులు, మండల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, ఎంఈవోలు గిరిధర్‌శర్మ, షేక్ మొయినుద్దీన్, ఆర్‌ఐ హర్షగౌడ్, ఏవో మహబూబ్ బాషా, ఏపీఎం నరేష్, ఏపీవో మహాలక్ష్మి, విద్యుత్ శాఖ ఏఈ బాల గురవయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ రెడ్డి, పశువైద్యాధికారులు హరిబాబు, నాగలక్ష్మి, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : జీఎస్టీ తగ్గింపుపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో బాల చెన్నయ్య తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జీఎస్టీతో తగ్గిన వస్తువుల వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.

కోరం లేక సమావేశం వాయిదా

పామూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రతినెలా 28న జరిగే మండల సమాఖ్య సమావేశం కోరంలేక వాయిదా వేసినట్లు ఏపీఎం జి.విద్యాసాగర్ తెలిపారు. వీవోఏల అధ్యక్షులను సమావేశానికి తీసుకురావడంలో సీసీలు విఫలమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి

పామూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ వైద్యం ద్వారా మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పట్టణంలోని నెల్లూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీబాలాజి ఫిజియోథెరపీ రిహ్యాబిటేషన్ క్లీనిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ కలవకూరి వెంకటేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, యారవ శ్రీను, వరికుంటపాడు జడ్పీటీసీ రావేళ్ల నాగేంద్ర, ఇర్రి కోటిరెడ్డి, టి.కొండారెడ్డి, డి .రాజేశ్వరరావు, జి.శేషాద్రి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వశక్తితో ఆర్థిక పురోగతి చెందాలి

- మహిళలకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచన
- రూ6.44 కోట్ల చెక్కుల పంపిణీ



మండలసమాఖ్యకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ తదితరులు

కనిగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వశక్తితో మహిళలు ఆర్థిక పురోగతి చెందాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం ఎస్‌హెచ్‌జీ సంఘాలకు డీఆర్‌డీఏ పీడీ నారాయణతో కలసి రూ.6 కోట్ల 44లక్షల 50వేలు చెక్కులు ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గ్రామాల్లో కూడా మహిళలు చిరువ్యాపారాలు చేసుకుని వృద్ధి చెందాలన్నారు. అందుకోసం తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈరుణాలతో గ్రామాల్లోనే చిన్న కుటీరపరిశ్రమలు, వస్తువుల తయారీ, నిత్యావసర, కూరగాయల దుకాణాలు, ఫ్యాన్సీ అంగళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళా కుటుంబాలు వ్యవసాయ పొలాల అభివృద్ధి, పంటల సాగు, కూరగాయల సాగు, పశుపోషణ వంటివి నిర్వహించుకుంటూ వాటి ద్వారా ఆర్థికంగా ఎదగాలన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ మాట్లాడుతూ బ్యాంకుల లింకేజీ రుణాలు, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, ఎఫ్‌పీ ద్వారా రుణాలను పొంది సకాలంలో చెల్లించాలన్నారు. తద్వార తక్కువ వడ్డీతో మంచి లాభాలను పొందవచ్చునని చెప్పారు. డీఆర్‌డీఏ ఏపీఎంలు, సీసీల సూచనలు పాటించాలన్నారు. రుణాల చెల్లింపులోనూ ఎస్‌హెచ్‌జీ మహిళలు సహకరించాలన్నారు.

కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, యారవ శ్రీను, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు , మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఏపీఎం అశోక్, సీసీలు బాషా, జిలాని, రమణయ్య, సుబ్రమణ్యం, వజ్రమ్మ, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దర్శి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో సీజనల్ వ్యాధులు సోకుతున్నాయన్నారు. పట్టణంలో ఎక్కడా మురికినీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. దర్శి మున్సిపల్ పరధిలో వార్డులు సంఖ్యను 27కు పెంచటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మహేశ్వరరావు, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వార్డుల సంఖ్య

దర్శి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 20 వార్డులు ఉండగా, తాజాగా 27 వార్డులుగా పెంచుతూ అధికారులు నోటిఫికేషన్ జారీచేశారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 29,991 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 11,412 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఒక్కో వార్డుకు సగటున 1100 ఓటర్లు వచ్చేవిధంగా వార్డులను విభజించినట్లు కమిషనర్ వై.మహేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వారంరోజుల్లో తెలియజేయాలని సూచించారు.

దుకాణాల వద్ద ధరల బోర్డులు ఏర్పాటుచేయాలి



పీసీపల్లిలో జీఎస్టీ ద్వారా తగ్గిన ధరలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీసీపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దుకాణాల వద్ద ధరల బోర్డులను ఏర్పాటుచేయాలని కమర్షియల్ ట్యాక్స్ అధికారి బాజిరెడ్డి అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం పీసీపల్లిలో కిరాణా, ఫ్యాన్సీ దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధరకాల వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌ను తగ్గించిందన్నారు.

అనంతరం పీసీపల్లి సెంటర్‌లో వివిధ శాఖల ఉద్యోగులు, తదితరులు మానవహారంగా ఏర్పడి తగ్గిన వస్తువుల ధరల గురించి ప్రజలకు అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ క్రిష్ణారావు, ఏవో ఎస్.రంగాక్రిష్ణ, ఏపీవో కొండయ్య, ఏపీఎం సత్యానందం, పీసీపల్లి పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం

- వైభవంగా సాగుతున్న శరన్నవరాత్రులు

దర్శి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. స్థానిక కనకదుర్గమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, దద్దాలమ్మ, పోలేరమ్మ, వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు చేసి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



పీసీపల్లి: సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో సోమవారం శ్రీఈశ్వరీమహదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పామూరు: స్థానిక వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా చిన్నారులకు సింగిల్‌విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి అర్చకులు మహం కాళి శివప్రసాద్, ఉగూరు ఏడుకొండలు ఆధ్వర్యంలో పలకలు, బలపాలు పంపిణీ చేసి ఆశీర్వదించారు.

అలాగే, సీఎస్‌పురం మండలం భైరవకోనలో శరన్నరాత్రుల వేడుకలను ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యాంసుందర్‌రాజు, ఈవో డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నరు. సోమవారం అమ్మవారు మహిషా సురవర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అభిషేకాలు, కుంకుమార్చన పూజలు, చండీ హోమాలు నిర్వహించారు.



దర్శి: సరస్వతీదేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు

కార్యక్రమంలో జిల్లా షీప్ సొసైటీ చైర్మన్ తోడేటి గోపి, అంబవరం, కొత్తపల్లి సర్పంచ్‌లు కె.కొండయ్య, ఎం.శ్యామల నారాయణ, వెంకటరాజు, జీవీ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: శరన్నవరాత్రుల సందర్భంగా ఏనిమిదవ రోజైన సోమవారం మల్లేశ్వరస్వామి ఆలయంలోని భ్రమరాంబికాదేవి అమ్మవారు శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అష్టోత్తర పూజ, లలితాసహస్ర నామస్తోత్రం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి

పామూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని డీఎస్‌వో పద్మశ్రీ అన్నారు. పట్టణంలోని పలు రేషన్ దుకాణాలతో పాటు గోపాలపురంలోని రేషన్ దుకాణాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాకు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. రేషన్ దుకాణదారులు సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఆమెవెంట కనిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటి భూపతి ఉన్నారు.



పామూరులో రేషన్‌షాపును పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

105 మందికి వైద్య పరీక్షలు

తాళ్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో మల్కాపురం పంచాయతీలో సోమవారం జరిగిన స్వస్థ్ నారీ-సశక్త్‌పరివార్ అభియాన్ కార్యక్రమంలో 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు డాక్టర్ రాజేష్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కాలేషావలి, దర్శి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాశీం సైదా తదితరులు పాల్గొన్నారు.

కోవిలంపాడులో తాగునీటి సరఫరా పునరుద్ధరణ


సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామంలో నీటి సమస్యను ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో గ్రామ టీడీపీ నాయకులు పరిష్కరించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేసేక్రమంలో ట్యాంక్‌లో ఉన్న మట్టి పైపుల్లోకి చేరడంతో నీటి సమస్య ఏర్పడింది. దాంతో గత 13 రోజుల నుంచి నీటి సరఫరా లేక గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి లావణ్యకుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు అమడసాని బాలకేశవరెడ్డి, తెలుగుయువత ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాషా సొంత నిధులతో మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు.


మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

తాళ్లూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల్లో నిరక్షరాస్యులకు వలంటీర్లు సామాజిక బాధ్యతతో అక్షరాలు నేర్పించాలని ఎంపీడీవో పి.అజిత అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అక్షరభారతి రెండో దశ ఉల్లాస్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అక్షరభారతి సూపర్ వైజర్ చౌటిరెడ్డి మాట్లాడుతూ శివరాంపురం, మన్నేపల్లి, వెలుగువారిపాలెం, బొద్దికూరపాడు గ్రామాల్లో 3075 మంది నిరక్ష్యరాస్యులను గుర్తించామన్నారు. వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి, టి.శివనాగిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత, ఎంఈవో జి.సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం రేగులచెలుక చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు సోమవారం తహసీల్దార్ షేక్ హుసేన్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టి మట్టిని అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.





● అరవింద వారధిని తాకుతూ వరద ప్రవాహం

కమీషన్‌కు.. లోనుకావాల్సిందే!

- డ్వాక్రా మహిళలపై ఆర్పీ, యానిమేటర్ల దోపిడీ!
- రుణం పొందాలంటే మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే
- ఒక్కో గ్రూపు నుంచి రూ. 10వేల నుంచి 15వేలు వసూలు
- పొదుపు రుణాల్లోనూ వాటాకు డిమాండ్



రుణాలు మంజూరు కావాలంటే.. ముందుగానే కమీషన్‌కు లోను కావాల్సిందేనని పొదుపు సంఘాల మహిళలపై ఆర్పీలు, యాని మేటర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాం కులు.. రుణ చెల్లింపులు బాగా ఉండి, రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చినా సరే వాటికి మోకా లడ్డు తున్నారు. ముందుగా కమీషన్ చెల్లిస్తేనే రుణానికి దరఖాస్తు పెడతా మని తెగేసి చెబుతున్నారు. ఇలా డ్వాక్రా మహి ళలపై యానిమేటర్లు, రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)ల దోపిడీ నిత్యకృత్యంగా మారి పోయింది. కానీ, వారిపై ఫిర్యాదు చేసేం దుకు పొదుపు మహిళలు ముందుకు రావడం లేదు. ఒక వేళ వచ్చినా తగిన చర్యలుంటాయన్న ఆశా వారికి లేదు.

ప్రత్తిపాడు మండలంలో డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు కావాలంటే.. తమకు కమీషన్లు ఇవ్వాల్సిందేనంటూ యానిమేటర్లు పట్టుబట్టిన విషయం తాజాగా వెలుగు చూసింది. యానిమేటర్ మొదలు ఏపీఎం వరకూ చేతులు తడిపితేనే రుణాలు వస్తాయంటూ బెదిరింపులు శ్రుతిమించడంతో వివాదం రచ్చకెక్కింది.



బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల మహిళలను మామూళ్ల గద్దలు వేదించుకు తింటున్నాయి. డ్వాక్రా సంఘాల్లో ఏ చిన్న పని జరగాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వావలంబన కోసం ఇచ్చే రుణాలు మొదలు అత్యవసర పరిస్థితుల్లో తాము దాచుకున్న పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా గ్రూపు సభ్యులైన మహిళలు భారీ మొత్తంలో కమీషన్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిపై మహిళలు గగ్గోలు పెడుతున్నా.. ఏమాత్రం వెరవకుండా పట్టణాల్లోని మెప్మా రిసోర్స్ పర్సన్లు, గ్రామాల్లోని సెర్ప్ యానిమేటర్లు అందినకాడికి మహిళలను దోచేస్తున్నారు.

● రాబందుల్లా ఆర్పీ, యానిమేటర్లు

ఉమ్మడి జిల్లాలో గ్రామీణాభివృద్ధి (మిగతా 6వ పేజీలో)

● పెనుమూడిపల్లెపాలెం వాసులను పడవల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలింపు




జల దిగ్బంధంలో లంకలు

- రోడ్లపైకి నీరు చేరటంతో దారులు మూత
- ఇళ్లలోకి వరద నీరు... లోతట్టు గ్రామాల నుంచి సురక్షిత ప్రాంతాలకు
- పెనుమూడిలో నదివైపు ఇళ్లలోకి నీరు
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక



పోతార్లంక నుంచి ట్రాక్టర్‌పై ఒడ్డుకు వస్తున్న యువకులు



దోనేపూడి వద్ద వరద నీటిలో పసుపు

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ కృష్ణా పరివాహక ప్రాంత లంక గ్రామాలను చుట్టుముడుతోంది. రోడ్లపై ప్రవహిస్తుండటంతో రాకపోకలకు వీలులేకుండా దారులు మూసుకుపోతున్నాయి. మరోపక్క లోతట్టు గ్రామాల్లోని ఇళ్లలోకి క్రమంగా నీరు చొచ్చుకొస్తోంది. దీంతో ఆయా గ్రామాల నుంచి జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఇటు గుంటూరు జిల్లా, అటు బాపట్ల జిల్లాల పరిధిలో అరటి, కంద, పసుపు, తమలపాకు, బొప్పాయి వంటి వాణిజ్య పంటలు నీట మునిగాయి. పిలకతోటలు పూర్తిగా నీటిలో మునిగిపోతే, గెలలు వేసిన చెట్లు కూడా కనిపించకుండా ఆకులు చివర్ల మాత్రమే వరద నీటిలో తేలియాడుతూ కనిపిస్తున్నాయి.

ముంచెత్తుతున్న కృష్ణమ్మ



రేపల్లె: మోర్తోట ఆలయం చుట్టూ చేరిన వరదనీరు



ఆవులవారిపాలెం రహదారిపై వరద నీరు



తిప్పలకట్ట వద్ద వరద ప్రవాహంతో పొలాలకు కోత

పరిశీలించిన అర్జీలకు వెంటనే పరిష్కారం

- ప్రతి శుక్రవారం 22ఏ భూ సమస్యలపై సమీక్ష
- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



అర్జీ దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసిన అర్జీలను అధికారులు పరిశీలించిన వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా కలెక్టర్‌కు వివరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పింఛన్లను 1వ తేదీనే వంద శాతం పంపిణీ చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి నెలా 28న ఉదయం 10.30 గంటలకు పెన్షన్లు, నిత్యావసరాల పంపిణీపై సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ లోపే.. అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు మిగిలిన వస్తువులు పంపిణీ చేసే విధంగా చూడాలని డీఎస్‌వోను కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల ద్వారా పింఛన్లు పంపిణీ చేయించే విధంగా.. ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, నిషేధిత జాబితా 22ఏ భూముల సమస్యలను జేసీ, డీఆర్వో, ఏడీ సర్వే, భూ రికార్డ్స్, సబ్ రిజిస్ట్రార్, ఆర్డీవో, తహసీల్దార్లతో కలిసి ప్రతి శుక్రవారం సాయంత్రం 3 గంటలు నుంచి 5 గంటల వరకు పరిష్కరిస్తానన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన నిషేధిత జాబితాను ముందుగా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెంపరాలను వెంటాడుతున్న విషజ్వరాలు

మంచం పట్టిన 200 మంది గ్రామస్థులు

అద్దంకి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విష జ్వరాలు వెంపరాల గ్రామ ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. నెల రోజులుగా విష జ్వరాలతో పాటు కీళ్ల నొప్పులతో పలువురు మంచం పట్టారు. దీంతో కొంత మంది స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతుండగా.. అద్దంకిలోని ప్రైవేట్ వైద్యశాలకు అధికంగా పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం వెంపరాలలో జ్వర బాధితుల సంఖ్య 200 మందికిపైగానే ఉంది. గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టలేదని గ్రామస్థులు అంటున్నారు. మంచినీటి పైప్ లైన్లు సైడ్ డ్రెయిన్లలో ఉండటంతో లీకులు ఉన్న చోట మురుగు నీరు కలుస్తుందన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషజ్వరాలు విజృంభించినా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో.. ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి రూ.వేలకు వేలు వైద్య ఖర్చులకు అవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న సుబ్బారావు



కొమ్మినేనివారిపాలెంలో రైతుకు ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

సకాలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

- ఈఈ నల్లూరి మస్తాన్‌రావు
- 160 మంది రైతులకు.. 32 ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

బల్లికురవ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ విద్యుత్ సమస్య లేకుండా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అద్దంకి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం సబ్ స్టేషన్‌లో బల్లికురవ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 160 మంది రైతులకు 32 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఈఈ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా బల్లికురవ మండలానికి ఏడాదిలో రూ.8 కోట్ల విలువ చేసే 947 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసి లైన్లను ఏర్పాటు చేశామన్నారు. మున్ముందు దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి సకాలంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎళ్ల నుంచి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను ఆర్డీఎస్ఎస్ పథకంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైతులు విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గృహాలకు కూడా త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులు మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, కార్గిల్ చౌదరి, టీడీపీ నేతలు చింతల శ్రీనివాసరావు, ఏల్చూరి శ్రీనివాసరావు, దివ్వె రాధ, కొమ్మినేని బాబురావు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు 3 నుంచి శిక్షణ తరగతులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో.. గుంటూరు, పల్నాడు, బాపట్ల ప్రాంతాల్లోని కళాశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందు కోసం విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జోన్-3 పరిధిలో దాదాపు 1,600 మంది వరకు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇటీవల వీరికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది. పాఠశాలల్లో వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు అవసరమైన ప్రాథమిక శిక్షణను విద్యాశాఖ అందించనుంది.

శిక్షణ తరగతులు ఇలా..

డీఎస్సీ కన్వీనర్ జారీ చేసిన ఉత్తర్వు ల ప్రకారం తొలుత ప్రాథమిక శిక్షణ అందిస్తారు. విద్యాబోధనలో ప్రావీణ్యం, విద్యాశాఖ విధానాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. విద్యాహక్కు, బాలల హక్కులు వంటి ముఖ్యమైన చట్టాలను వివరిస్తారు. జాతీయ విద్యా విధానం, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తారు. పాఠ్యప్రణాళికల తయారీ, బోధన పద్ధతులు, మూల్యాంకన విధానా లు, నిత్య విద్యార్థిగా ఉంటూ బోధ నను మెరుగు పరుచు కోవడం, విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించడం వంటి అంశా లపై సవివరంగా శిక్షణ ఇస్తారు.

సరస్వతిదేవిగా బగళాముఖి



చందోలులోని బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ కార్యక్రమాలు 8వ రోజు ఘనంగా జరిగాయి. సోమవారం శ్రీ బగళాముఖి అమ్మవారు సర్వదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచారు.

నేటితో గడువు..

పొడిగిస్తేనే ఆదరువు

- 'బర్లీ' కొనుగోళ్లు కొనసాగేనా!
- నేటితో పొగాకు సేకరణకు ముగింపని గతంలో ప్రకటన
- మరో రెండు వారాల గడువు పెంచాలని అధికారుల నివేదికలు
- ఇంకా రైతుల వద్ద దాదాపు లక్ష క్వింటాళ్లు
- గోదాముల విషయంలో కొనసాగుతున్న ఇక్కట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది మొదలుకుని నేటి వరకు అనేక బాలారిష్టాలు ఎదురైనా వాటిని సమర్థంగా ఎదుర్కొని కొనుగోళ్ల అంకాన్ని ఓ కొలిక్కి తేగలిగారు. సెప్టెంబరు చివరితో కొనుగోలు కేంద్రాలు మూసివేస్తామని గతంలోనే మార్క్‌ఫెడ్ అధికారులు చెప్పారు. కానీ ఇంకా రైతుల వద్ద దాదాపు లక్ష క్వింటాళ్ల వరకు పొగాకు నిల్వలు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నా యి. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల ప్రక్రియ ఇంకో రెండు వారాల పాటు కొనసాగితే మరి కొంత మంది బర్లీ రైతులకు మేలు జరుగుతుందని, అందుకు (మిగతా 6వ పేజీలో)



గోడౌన్లలో బర్లీ పొగాకు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ముప్పవరం సర్వీస్‌రోడ్డులో ఘటన


మృతి చెందిన యువకుడు


108 వాహనంలో బాధితుడు

పంగులూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం ప్రధానకూడలిలో ఫ్లైఓవర్ పక్కన సర్వీస్ రోడ్డులో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి సంఘటనా స్థలంలో మృతిచెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఒంగోలువైపు నుంచి చిలకలూరిపేటవైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇరువురు వ్యక్తులు హైవే పక్కన సర్వీస్‌రోడ్డులో అదుపుతప్పి పడిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇద్దరు చిలకలూరిపేటకు చెందినవారుగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ వినోద్‌బాబు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడి రోడ్డుపై ఉన్న యువకుడు

పంగులూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగర్లమూడి వారిపాలెం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ సమీపంలో డివైడర్‌కు ఢీకొట్టి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతున్న తెలగతోటి రాఘవరావు డివైడర్ ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాఘవరావును హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయిన కారు

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొనడంతో ప్రమాదం


ధ్వంసమైన కారు

అద్దంకి, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. స్థానికుల కథనం మేరకు... ఒంగోలు వైపు నుంచి అద్దంకి వైపు వస్తున్న కారు సోమవారం ఉదయం అద్దంకి పట్టణంలోని భీక్షాలు కాలనీ వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు. కారు మాత్రం దెబ్బతింది.

నిరుపేద విద్యార్థికి రూ.40వేల ఆర్థిక సాయం

పర్చూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నూతలపాడు గ్రామానికి చెందిన పల్లపు బాలాజీ అనే ఇంజనీరింగ్ విద్యార్థికి సోమవారం రూ.40వేల ఆర్థిక సహాయం అందజేశారు. కొల్లా సాంబశివరావు సమకూర్చిన నగదును రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ చేతుల మీదుగా విద్యార్థికి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కోమటి ఆంజనేయులు, నాగభైరు శ్రీనివాసరావు, మానుకొండ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం రేగులచెలుక చెరువులో అక్రమం గా మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు సోమవారం తహసీల్దార్ షేక్ హుసేన్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టి మట్టిని అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పంగులూరులో సూపర్‌లీగ్ ఖోఖో పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఖోఖోఅసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య


ఖోఖో ప్రారంభ పోటీలో గెలుపు కోసం తలపడుతున్న ఇరుజట్లు

పంగులూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : క్రీడలలో గ్రామీణ యువత ఉత్సాహంగా పాల్గొనాలని మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బి.సిహెచ్.గరటయ్య కోరారు. పంగులూరులోని ఎంఎస్‌ఆర్ అండ్ బీఎస్‌ఎం జూనియర్ కళాశాలలో ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీ నిర్వహిస్తున్న సూపర్‌లీగ్ ఖోఖో పోటీలను సోమవారం డాక్టర్ గరటయ్య ప్రారంభించారు. అకాడమీ నిర్వాహకులు కె.కె.ఎఫ్.ఐ ఉపాధ్యక్షుడు సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభసభలో గరటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలలో రాణించిన యువతకు విద్య, ఉద్యోగాలలో ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించారని, ఆరుసార్లు రాష్ట్ర, మూడుసార్లు జాతీయ స్థాయి ఖోఖో పోటీలను స్థానిక ప్రజల సహకారంతో పంగులూరులో విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. ప్రోకబడ్డీ తరహాలో పంగులూరు కేంద్రంగా ప్రో ఖోఖో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థిని, రాజస్థాన్ యువతి బీజియా నృత్య ప్రదర్శన, మహిళల కోలాట ప్రదర్శన అలరించాయి. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావు, ప్రిన్సిపాల్ ఉషారాణి, క్లబ్ ప్రతినిధులు షేక్ కాలేషావలి, వీరరాఘవయ్య, ఆర్.వి.సుబ్బారావు, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డి, సౌజన్య, ప్రజాకళాకారుడు నందవరపుజాన్ పాల్గొన్నారు.

సాదాసీదాగా అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం సోమవారం సాదాసీదాగా సాగింది. చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశంలో మొత్తం 12 అంశాలను ఆమోదించారు. సమావేశం ప్రారంభమైన 15 నిమిషాల వ్యవధిలోనే పూర్తయ్యింది. అనంతరం వార్డుల విభజనపై కౌన్సిలర్లు తమకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వార్డుల విభజన ఏ విధంగా చేస్తున్న విధానాన్ని కమిషనర్ రవీంద్ర వివరించారు. తన వార్డు పరిధిలో ఇంతవరకు ఈవిషయం తనకు తెలియదని 1వ వార్డు కౌన్సిలర్ బాలు చెప్పటంతో అందరూ ఒక్కసారిగా నవ్వారు. పదవీ కాలం కూడా పూర్తవుతుంటే ఇప్పటి వరకు వార్డు పరిధి తెలియదనటం ఏమిటని పలువురు వ్యాఖ్యానించారు. తమ వార్డులలో జరిగిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని 1, 20వ వార్డుల కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావు కోరారు. వైస్ చైర్మన్లు దేసు పద్మేష్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో జీవన పోరాటం

నా అనే వారు లేకున్నా పొట్టచేతబట్టుకుని ప్లాస్టిక్ వస్తువుల అమ్మకం

అవగాహన లేక ప్రభుత్వ పథకాలకు దూరం


రిక్షా తొక్కుతూ ప్లాస్టిక్ పూలు అమ్ముకుంటున్న వృద్ధురాలు పోలమ్మ

పర్చూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కండలు ఉడికిపోయాయి.. ఎముకలు వంగిపోయాయి.. సత్తువ సన్నగిల్లింది.. అయినా బతుకుదెరువు కోసం వృద్ధాప్యంలో జీవన పోరాటం చేస్తుంది ఆ వృద్ధ మహిళ. నోట్లోకి నాలుగువేళ్లలేని పరిస్థితి ఆవరించింది. ఈ దుర్భర స్థితిలో, తెలిసిన వారి వద్ద అతి కష్టం మీద అప్పుతీసుకొని రిక్షా బండిపై ప్లాస్టిక్ పూలు అమ్ముకుంటూ బతుకు బండి లాగుతోంది. పర్చూరు మండలం నాగులపాలెంలో నివాసం ఉంటున్న గాలేటి పోలమ్మకు ముప్పై ఏళ్ల క్రితం భర్త చనిపోయారు. ఆ తర్వాత ఉన్న ఒక్క కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కూడా చనిపోయారు. ఆమె కుంగిపోయింది. ఆరు పదుల వయస్సు పైబడినా స్వశక్తితో జీవించేందుకు ఎండనక, వాననక రిక్షా బండిపై ప్లాస్టిక్ పూలు పెట్టుకొని రిక్షా తొక్కుకుంటూ ఈ చుట్టుపక్కల గ్రామాలన్నీ తిరుగుతూ పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది.

అర్హత ఉన్నా అందని సంక్షేమ పథకాలు...

పోలమ్మకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నా వాటిని తీసుకునే పరిజ్ఞానం లేక అందుకోలేకపోతోంది. కనీసం ఆధార్ కార్డు కానీ, రేషన్ కార్డు కానీ లేకపోవటం బాధాకరం. దీంతో వృద్ధాప్య పింఛన్ సైతం అందుకోలేని దుస్థితి. అధికారులు స్పందించి వృద్ధురాలి దీన స్థితిని గమనించి నిబంధనలు సడలించి ఆధార్, రేషన్ కార్డును మంజూరు చేసి ప్రభుత్వ పింఛనన్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సరస్వతీదేవి నమోస్తుతే


అద్దంకిలోని వేయిస్తంభాల గుడిలో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు

అద్దంకి, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా సోమవారం అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడి, కన్యకాపరమేశ్వరి దేవాలయం, దత్తపాదు కా క్షేత్రం, పోలేరమ్మ దేవాలయం లలో అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించారు. శింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సరస్వతీ పూజ నిర్వహించారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అద్దంకిలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభించి 54 సంవత్సరాలు పూర్తయినందున సోమవారం 54 కిలోల లడ్డును ఊరేగింపుగా తీసుకువెళ్లి దేవాలయంలో ఉంచారు.

పంగులూరులో...

పంగులూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. రేణింగివరం గ్రామంలోని త్రిశక్తి పీఠం, ముప్పవరంలోని శ్రీషిర్డీసాయి ఆలయాలలో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. అలాగే చందలూరులోని చిట్టాబత్తినవారి రేణుకమ్మ ఆలయంలో, గోవిందయ్య కళానిలయంలో అమ్మవారిని అలంకరించి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. రామకూరు, పంగులూరు పరిసర గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

మార్టూరులో...

మార్టూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో మహాచండీ దేవి అవతారంలో, ద్రోణాదులలో వారాహి అవతారంలో అ మ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. వలపర్లలో, మార్టూరులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో, పడమర బజారున రుక్మాబాయి సమేత పాండురంగ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో, నాగరాజుపల్లిలోని దేవాలయంలో అమ్మవారు పూజలందుకున్నారు.

బల్లికురవలో...

బల్లికురవ, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో దసరా నవరాత్రి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నక్కబొక్కలపాడు గ్రామ పోలేరమ్మ దేవాలయంలో నవరాత్రుల వేడుకలలో భాగంగా సరస్వతి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలానే కొత్తపాలెం, కొత్త మల్లాయపాలెం, వేమవ రం, అంబడిపూ డి, కొమ్మి నే ని వారి పాలెం, కొప్పెరపాడు గ్రామాలతో పాటు పలు గృహాలలో సోమవారం సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులకు దేవాలయాలలో అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

రామాలయం గర్భగుడిని తాకిన సూర్య కిరణాలు

బల్లికురవ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం రామాలయంలో గర్భగుడిలో ఉన్న దేవతామూర్తుల విగ్రహాలను సోమవారం సూర్యకిరణాలు తాకాయి. దక్షిణాయనం మొదలు రోజూ రామయ్యను ఉదయం పూట సూర్యకిరణాలు తాకటం ఆనవాయితీ. మూల నక్షత్రం కావటంతో సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సూర్యకిరణాలను తిలకించారు. పూజారి అయినవోలు సుబ్బాచార్యులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

చినగంజాంలో...

చినగంజాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి మందిరంలోని బతుకమ్మ అమ్మవారిని మహిళా భక్తులు ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమ పూజలు నిర్వహించారు. సోపిరాల గ్రామ రామకోటేశ్వర స్వామి ఆలయంలోని లలితా పరమేశ్వరి అమ్మవారిని, చినగంజాం గ్రామంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని, రైల్వేసెంటర్ భవానీపురంలోని విజయకనకదుర్గాభవాని అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. నీలాయపాలెం, కడవకుదురు, గొనసపూడి, పెదగంజాం, చింతగుంపల్లి, సంతరావూరు తదితర గ్రామాల్లో వివిధ రూపాల్లో అలంకరించిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాలు రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కమీషన్‌కు లోనుకావాల్సిందే..!

(5వ పేజీ తరువాయి)

శాఖ పరిధిలో 74,640 స్వయం సహాయక బృందాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. వాటిలో ఏడున్నర లక్షల మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. గ్రూపు నిర్వహణ, సభ్యుల సమావేశం, కార్యకలాపాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లను మెప్మా నియమించగా, గ్రామీణ ప్రాంతాల్లో యానిమేటర్లను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నియమించింది. ఇలా గ్రూపు మహిళలకు సహాయ, సహకారాలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు రాబందుల వ్యవస్థగా మారిపోయింది. గ్రూపు మహిళలను పీడించుకుతింటున్నారు. డ్వాక్రా మహిళలు తమకు కమీషన్ చెల్లించడం అనేది హక్కుగా చెబుతూ వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. ఒక్కో పనికి రేటు కట్టి మామూళ్ల వసూళ్లు చేస్తున్నారు.

● రుణం పొందాలంటే రూ. 10వేలు ఇవ్వాల్సిందే!

డ్వాక్రా గ్రూపుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణ సహాయం చేస్తుంది. ఏదో ఒక స్వయం ఉపాధి పొందుతూ.. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఆ రుణాలు తోడ్పడుతాయి. రుణం తీరిన వెంటనే మరోమారు రుణాలు అందిస్తుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను యానిమేటర్లు, ఆర్పీలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాలు బ్యాంకుల నుంచి సభ్యుల ఖాతాల్లో జమ కావాలంటే యానిమేటర్ లేదా ఆర్పీ తీర్మానం రాసి, సీసీ, ఏపీఎం సంతకాలు చేయించి అప్రూవల్ చేయించాలి. ఇదే వారికి వరంగా మారింది. దీనిని అడ్డం పెట్టుకుని ప్రతిసారి ఇలా రుణం పొందే సమయంలో ఒక్కో మహిళ నుంచి రూ.వెయ్యి, రూ.1,500 వరకూ, లేదంటే గ్రూపు మొత్తంగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఆర్పీలు, యానిమేటర్లు వసూలు చేస్తున్నారు. పొదుపు మహిళలు ఇవ్వడానికి ఇష్టపడకపోతే తీర్మానాలు రాయకుండా ఆపుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా వెరవని స్థితికి వారు చేరారు. మహిళలు ఫిర్యాదులు చేయకుండా బెదిరింపులకు దిగుతున్నారు. వీటితోపాటు అత్యవసర సమయంలో పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా వీరి మామూళ్ల బాదుడు తప్పడం లేదు. గ్రూపునకు రూ.2వేల నుంచి రూ.4వేలు ఇవ్వకుండా పని మాత్రం జరగడం లేదు. వీటితోపాటు ప్రతి నెలా నిర్వహించే గ్రూపు సమావేశంలో సమావేశంలోని అంశాలు, తీర్మానాలు రాసినందుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు లబోదిబో మంటున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

నేటితో గడువు.. పొడిగిస్తేనే.. ఆదరువు

(5వ పేజీ తరువాయి)

అనుమతివ్వాలనే అభ్యర్థనను రాష్ట్రస్థాయి అధికారులకు పంపినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం తొలుత ఇచ్చిన గడువు మంగళవారంతో ముగుస్తుండగా, కేంద్రాల కొనసాగింపుపై ప్రభుత్వ నిర్ణయం ఏ విధంగా ఉంటుందోననే ఆందోళన బర్లీ రైతుల్లో ఉంది

మూడు నెలల పాటు...

జూన్ చివరి వారంలో మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. బాపట్ల జిల్లాతో పాటు ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని బర్లీ పొగాకు రైతులకు మేలు జరిగేలా తొలుత 7 కేంద్రాలతో ప్రారంభించి మొత్తం 58 కేంద్రాలలో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు చేపట్టింది. గోదాములను గుర్తించిన చోటే కొనుగోళ్ల కేంద్రాలను తెరిచి రైతులు తమ నిల్వలను అక్కడకే తెచ్చేలా షెడ్యూలింగ్ ఇచ్చింది. మార్కెటింగ్, వేర్‌హౌసింగ్‌తో పాటు ఎఫ్‌సీఐ గోదాములను సైతం బర్లీ నిల్వలకోసం మార్క్‌ఫెడ్ ఉపయోగించింది. గోడౌన్‌ల కొరత కారణంగా కొనుగోళ్ల ప్రక్రియ ఎటువంటి విఘాతం కలగకూడదని ముందస్తుగానే చర్యలు తీసుకుని మూడు నెలల పాటు ఈ అంకాన్ని మార్క్‌ఫెడ్ ముందుకు తీసుకెళ్లగలిగింది. ప్రస్తుతం 6 కేంద్రాలలో కొనుగోళ్లు జరుగుతుండగా మంగళవారంతో ప్రక్రియ ముగుస్తుందా లేదా కొనసాగింపుకు ప్రభుత్వం అనుమతిస్తుందా అనేది తేలాల్సి ఉంది

లక్షల క్వింటాళ్లలోనే మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసినా...

ఇప్పటి వరకు నాలుగు జిల్లాల పరిధిలో 2,08,510 కింటాళ్ల బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే 1,40,298 క్వింటాళ్లుగా ఉండగా, గుంటూరు జిల్లాలో 32,064, పల్నాడులో 23,693, ప్రకాశం జిల్లాలో 12,455 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ సేకరించింది. మొత్తం 11,462 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఇప్పటికే దశల వారీగా రైతుల ఖాతాల్లో రూ.90కోట్లు జమ చేసిన మార్క్‌ఫెడ్ ఇంకా దాదాపు రూ.50 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని చెబుతోంది. ఇంత పెద్ద ఎత్తునా మార్క్‌ఫెడ్ కొనుగోళ్ళు జరిపినప్పటికీ ఇంకా అన్నదాతల వద్ద లక్ష క్వింటాళ్ల వరకు బర్లీ నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది

సాగుకు సమస్యలు లేకుండా చర్యలు

అవీఇవీ

తోటవారిపాలెం పంపింగ్ స్కీంను ప్రారంభించిన ఎమ్మెల్యే


ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

బోయినవారిపాలెం(చీరాల), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సాగు చేసేందుకు రైతులకు సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. సోమవారం మండల పరిధిలోని బోయినవారిపాలెంలో గల తోటవారిపాలెం ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరించిన కారణంగా నియోజకవర్గంలోని ఐదు పంపింగ్ స్కీంలు మూతపడ్డాయన్నారు. వాటిపై దృష్టి సారించినట్లు చెప్పారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెంపు

ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి

పర్చూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక పురోగతి చేకూరుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి చెప్పారు. ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీపై సోమవారం మండల అధికారులు, సచివాలయం సిబ్బందితో కలసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలకు సరాసరి రూ.1200 నుంచి రూ.1500 వరకు భారం తగ్గుతుందన్నారు. జిల్లా సీటీవో శ్రీనివాస్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షంషుద్దీన్, బీజేపీ నాయకులు అడపాల కృష్ణ, సామ్రాజ్యం, ఏవో శకుంతల పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల పనిభారం తగ్గించాలి


వినతిని పరిశీలిస్తున్న కమిషనర్ అబ్దుల్ రషీద్

చీరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించాలని, ఇంటింటికీ వెళ్లి అందించే సేవలపై పునఃపరిశీలన చేయాలని పలువురు ఉద్యోగులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కమిషనర్ అబ్దుల్ రషీద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ సేవలు, సర్వేలు, ఆధార్ సీడింగ్, వాహనమిత్ర డేటా, బీఎల్‌వో డ్యూటీలతో అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగులు సతీష్, రాధిక, శ్రీను నాయక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శబరి ఎక్స్‌ప్రెస్.. ఇకపై సూపర్ ఫాస్ట్.!

నేటినుంచి మారనున్న రైలు నంబర్లు

హైదరాబాద్ నుంచి త్రివేండ్రంకు 2గంటల సమయం ఆదా

ప్రయాణికులపై సూపర్ ఫాస్ట్ చార్జీల భారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేండ్రం మధ్య నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ నేటి నుంచి సూపర్ ఫాస్ట్ రైలుగా మారనుంది. ప్రస్తుతం 17229/30 నంబర్లతో నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి 20629/30 నంబర్లతో పరుగులు పెట్టనుంది. గతంతో పోల్చుకుంటే రైలు వేగం పెరగడంతో ఆ రైళ్లలో ప్రయాణించే వారికి సుమారు 2 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. నిన్న, మొన్నటివరకు సికింద్రాబాద్ నుంచి రోజూ మధ్యాహ్నం 12.20గంటలకు బయల్దేరే శబరి ఎక్స్‌ప్రెస్ మరుసటి సాయంత్రం 6.05గంటలకు త్రివేండ్రంకు (29.45గంటల ప్రయాణం) చేరుకునేది. తాజాగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారాక ప్రతిరోజూ మధ్యాహ్నం 2గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయం త్రం 6.25గంటలకు (28గంటల్లో) చేరనుంది. అలాగే, ఇంతకుముందు త్రివేండ్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45గంటలకు సికింద్రాబాద్‌కు (30గంటల్లో) వచ్చే శబరి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్‌గా మారాక త్రివేండ్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు ఉదయం 11గంటల కల్లా(27.45గంటల్లోగా) చేరనుంది.

ప్రయాణికులపై 'సూపర్ ఫాస్ట్' బాదుడు.!

శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ కావడంతో ప్రయాణ సమయం 2గంటలు ఆదా అవుతుందని ఒకవైపు ఆనందపడుతున్న ప్రయాణికులు, మరోవైపు సూపర్ ఫాస్ట్ చార్జీల రూపేణా జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు అదనంగా రూ.15, స్లీపర్ ఏసీ తరగతుల టికెట్లపై రూ.30నుంచి 40వరకు అదనంగా చెల్లించాల్సి రావడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇప్పటివరకు దక్షిణమధ్యరైల్వే ఆధ్వర్యంలో ఉండే శబరి ఎక్స్‌ప్రెస్ నిర్వహణ (మెయింటెనెన్స్) బాధ్యతలను నేటినుంచి సదరన్ రైల్వే చేపట్టనుందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు.

రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి


రేషన్‌షాపును పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

పామూరు, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని డీఎస్‌వో పద్మశ్రీ అన్నారు. పట్టణంలోని పలు రేషన్ దుకాణాలతో పాటు గోపాలపురంలోని రేషన్ దు కాణాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాకు రికా ర్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. రేషన్ దుకాణదారులు సమ యపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఆమెవెంట కనిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ భూపతి ఉన్నారు.

తప్పిపోయిన చిన్నారి...

గుర్తించి కుటుంబానికి అప్పగించిన శక్తిటీం



చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో సోమవారం ఓ చిన్నారి తప్పిపోయింది. పోలీసులు గంటల వ్యవధిలోనే చిన్నారి తల్లిదండ్రులను గుర్తించి బిడ్డను అప్పగించారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పంగులూరుకు చెందిన దంపతులు వారి నాలుగేళ్ల పాపతో సహా బంధువులతో కలిసి పెళ్లి దుస్తులు కొనేందుకు చీరాల వచ్చారు. ఎం జీసీ మార్కెట్‌లోని షాప్‌లో అందరూ దుస్తులు చూసుకుంటుండగా చిన్నారి బయటకొచ్చింది. దుకాణాల సమీపంలో సంచరిస్తుండగా శక్తి టీం కంటపడింది. వారు పాపను స్టేషన్‌కు తరలించి ఆరా తీశారు. తల్లిదండ్రుల ఆచూకీ లేకపోవడంతో శక్తి టీం తల్లిదండ్రులను వెదికే పనిలో పడ్డారు. ఈలోపు బిడ్డ ఆచూకీ తెలియక తల్లిదండ్రులు రోదిస్తున్నారు. వారిని గుర్తించిన శక్తి టీం సెల్‌ఫోన్‌లో పాప ఫొటో చూపించగా మా బిడ్డే అని చెప్పడంతో సీఐ సుబ్బారావు వద్దకెళ్లారు. ఆయన బిడ్డను అప్పగించి సూచనలు చేశారు.

వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి

డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించిన ఆ పార్టీ నేతలు

రామకృష్ణాపురం(చీరాల), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి వైసీపీతోనే సాధ్యమని, రాష్ట్రంలో రెడ్ బుక్ పేరుతో సామాన్య వైసీపీ కార్యకర్తలను ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని పలువురు వైసీపీ నేతలు ఆరోపించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయంలో వైసీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు యాతం మేరిబాబు, వాసుమళ్ల వాసు, గవిని శ్రీను, గోసాల అశోక్, రాఘవరావు, రమణారెడ్డి, రాజకుమార్, మహేష్ పాల్గొన్నారు.

కడవకుదురులో సామాజిక తనిఖీ గ్రామసభ



మాట్లాడుతున్న డీఆర్‌పీ లీలాకృష్ణ

చినగంజాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పథకం పనులపై సోమవారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. 2024-25లో గ్రామంలో జరిగిన పనులు, వాటిపై జరిగిన అవకతవకలను గ్రామసభలో ఎస్‌ఆర్‌పీ నాగరాజు, డీఆర్‌పీ లీలాకృష్ణలు వివరించారు. ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన గృహనిర్మాణ పనులు, తోటల పెంపకం, వరదకట్టలలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఎంపీడీవో కె.ధనలక్ష్మి, ఏవో ఆర్.చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా చీరాల అభివృద్ధి

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య
కొన్ని పనులు ఈసారైనా చేయాలని వైసీపీ నేతల వినతులు



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య, చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు

చీరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రణాళిక రచిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. సోమవారం పురపాలక సంఘం సమావేశం హాలులో చైర్మన్ సాంబశివరావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ క్రమంలో అజెండాలో 35 అంశాలు ప్రవేశపెట్టగా 33వ అంశంలోని 1 నుంచి 3 వరకు అలాగే 6వ అంశాన్ని రద్దు చేశారు. మిగిలినవన్నీ ఆల్ పాస్‌గా ముగించారు. జీరో హవర్స్‌లో వైసీపీ కౌన్సిలర్లు బొనిగల జైసన్‌బాబు, బత్తుల అనీల్, చీమకుర్తి బాలకృష్ణలు తమ వార్డుల్లోని కొన్ని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. 'మా వైసీపీ ప్రభుత్వంలో వాటిని పరిష్కరించేందుకు అంతరాయం కలిగిందని, ఈ ప్రభుత్వంలోనైనా పరిష్కరించాలని కోరారు. దీంతో చైర్మన్ సాంబశివరావు, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాదనలు నడిచాయి. అవి కాస్త జటిలమయ్యే సమయంలో ఎమ్మెల్యే రెండు వర్గాలను సమన్వయం చేశారు. గతంలో మీరు అధికారంలో ఉండగా చేయలేకపోవడం వైఫల్యంగా చెప్పుకొచ్చారు. అయినా ఎటువంటి సమస్య లేదని, ఇది ప్రజా ప్రభుత్వమని, కచ్చితంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. సమస్యలున్న వార్డుల్లో నేరుగా పర్యటిద్దాం, మీరు కలిసి రండి.. భేదాలు లేకుండా అభివృద్ధి పనులు చేద్దామని చెప్పారు. సమావేశంలో కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

రైతులకు అన్నివిధాలా సహకారం అందిస్తాం



సొసైటీ చైర్మన్ సాంబశివరావును అభినందిస్తున్న నాయకులు

మార్టూరు,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సొసైటీల ద్వారా ఎరువులను సక్రమంగా ఇవ్వడంతో పాటు, వారికి అన్ని రకాలుగా సహకారం అందిస్తామని బొబ్బేపల్లి సొసైటీ చైర్మన్ జరుగుల సాంబశివరావు చెప్పారు. సోమవారం ఆయన మార్టూరులోని బొబ్బేపల్లి సొసైటీ కార్యాలయంలో చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. అదేవిధంగా డైరెక్టర్లుగా ముప్పా సాంబశివరావు, ముప్పవరపు వెంకటరామారావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో రెండోసారి సొసైటీ చైర్మన్‌గా రైతులకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందిస్తూ, ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం చైర్మన్ సాంబశివరావును ఎన్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, సీఈవో క మ్మ మస్తాన్‌రావు, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, కమ్మ శివనాగేశ్వరరావు, పోపూరి శ్రీనివాసరావు, శానంపూడి చైతన్య, శానంపూడి చిరంజీవి, పీడీసీసీ బ్యాంక్ మేనేజరు అన్నపూర్ణ, సూపర్ వైజర్లు ఎస్‌కే మస్తాని, ఏల్చూరి శ్రీనివాసరావులు అభినందించారు.

నూజెళ్లపల్లిలో దసరా ఉత్సవాల నిర్వహణకు అనుమతి

దేవదాయశాఖ అధికారుల నిర్ణయం
స్వస్థివాచకం, గ్రామోత్సవంపై ఆర్డీవో, డీఎస్పీ సూచనలు



సమీక్ష చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, డీఎస్పీ మహమ్మద్‌మొయిన్

పంగులూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల మనోభావాలకు అనుగుణంగా నూజెళ్లపల్లి గ్రామంలో దసరా పర్వదిన సందర్భంగా దేవతలకు స్వస్థివాచకం, గ్రామోత్సవం నిర్వహించేందుకు అందరూ సహకరించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడు, డీఎస్పీ మొయిద్దీన్ చెప్పారు. నూజెళ్లపల్లిలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అర్చకులైన చందలూరు వంశస్థులు, చల్లా వంశస్థుల మధ్య స్వస్థివాచకం నిర్వహణపై కొన్నేళ్లుగా వివాదం నెలకొనగా గ్రామంలో దసరా వేడుకలు నిలిచిపోయాయి. ఈ ఏడాది తమ గ్రామంలో పారువేట, గ్రామోత్సవం జరిపించాలన్న ప్రజల ఆకాంక్షల మేరకు రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖ అధికారులు ఆలయ అర్చకస్వాములు, చల్లావంశస్థులు కార్యక్రమం నిర్వహణపై పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వస్థివాచకం ఎవరు నిర్వహించాలి అనే విషయమై ఇరువురి వాదనలు విన్న అధికారులు దేవదాయశాఖ అధికారుల నిర్ణయం మేరకు ఉత్సవం నిర్వహణ చేపట్టాలని, అందుకు అందరూ సహకరించాలని సూచించారు. ఉత్సవం నిర్వహణలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, సీఐ మల్లికార్జునరావు, ఈవో శ్రీనివాసరావు, ఎస్ఐ వినోద్‌బాబు పాల్గొన్నారు

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై కమిటీ ఏర్పాటు

అధికారుల సమావేశంలో నిర్ణయం



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు,ఆర్డీవో గ్లోరియా,సీఐ శేషగిరిరావు

మార్టూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని డేగరమూడి గ్రామంలోని టీడీపీ, వైసీపీ నాయకులు, పలు దళిత సంఘాల నాయకులతో సోమవారం సాయంత్రం మార్టూరులోని ఎంపీడీవో కార్యాలయంలో డీఎస్పీ రామాంజనేయులు, ఆర్డీవో గ్లోరియా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రెండురోజులుగా డేగరమూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై జరుగుతున్న వివాదాల నేపథ్యంలో డీఎస్పీ, ఆర్డీవోలు ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు వారితో సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి వారందరి అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ, ఆర్డీవోలు వారితో మాట్లాడుతూ రెండు మూడు రోజులలో గ్రామంలోని అందరూ కలిసి అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. ఇదిలా ఉండగా గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు సీఐలపై విచారణ జరుగుతోందని, దాని వివరాలను ఉన్నత అధికారులకు పంపిస్తామన్నారు. సీఐ శేషగిరిరావు, తహసీల్దారు ప్రశాంతి, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రం, దారా అంజయ్య, డాక్టరు చారువాక, నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు జంపని వీరయ్యచౌదరి పాల్గొన్నారు.

రాళ్లపల్లిలో శ్మశాన స్థలం కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ నేతలు, రాళ్ళపల్లి ఎస్సీ కాలనీ వాసులు

అద్దంకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాళ్లపల్లి ఎస్సీ కాలనీకి శ్మశానస్థలం కేటాయించాలని పలువురు ఎస్సీ కాలనీవాసులు, ఎంఆర్‌పీయస్ నేతలు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కుంకుపాడు పంచాయతీ పరిధిలో ఉన్న రాళ్ళపల్లిలో ఎస్సీ కాలనీవాసులకు చెందిన శ్మశానం విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో పూర్తి గా కోల్పోయింది. రెండేళ్ల నుంచి శ్మశానం కోసం ఎస్సీ కాలనీవాసులు అధికారులను కలుస్తున్నా ఇంతవరకు కేటాయించలేదని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి పూనూరి రమేష్ చెప్పారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు నెహేమియా, పాలెపోగు సుబ్బరావు పాల్గొన్నారు.

అద్దంకి మున్సిపాలిటీ 27 వార్డులుగా విభజన



వార్డుల పునర్విభజన వివరాలను నోటీస్ బోర్డులో ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

6వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరణ

అద్దంకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపాలిటీని 27 వార్డులుగా విభజిస్తూ ఆయా వార్డుల పరిధిలోని ప్రాంతాలను నోటీస్ బోర్డులో ఉంచారు. ప్రస్తుతం 20 వార్డులు ఉండగా 27కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో వార్డుల పరిధి మార్పు చేస్తూ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, టౌన్‌ప్లానింగ్ అధికారి లక్ష్మీలు వివరాలను నోటీస్ బోర్డులో ఉంచారు. వార్డుల విభజనపై అక్టోబరు 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా అభ్యంతరాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అవీఇవీ

యూరియా బస్తాల పంపిణీ



రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజుపల్లిలో సోమవారం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా సొసైటీ అధ్యక్షుడు దామర్ల బ్రహ్మయ్య మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా సొసైటీకి 220 బస్తాలు యూరియా వచ్చాయన్నారు. బస్తా 267 రూపాయలకు అమ్ముతున్నట్లు తెలిపారు. రైతులందరికీ సకాలంలో ఎరువులను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణారావు, టీడీపీ నాయకులు మిన్నెకంటి పోతురాజు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయండి

చీరాలలో ప్రజా ఆత్మీయ సమ్మేళనంలో పోతుల సునీత



సునీత దంపతులను జీడిపప్పు దండతో సత్కరిస్తున్న నేతలు

చీరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంఎల్‌సీ పోతుల సునీత చెప్పారు. ఇటీవల వైసీపీని వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్న దంపతులు సోమవారం పట్టణంలోని బాపనమ్మ కల్యాణ మండపంలో ప్రజా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ భారం తగ్గించి సామాన్యులకు, వ్యాపారులకు అండగా ఉందని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు ద్వారా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సీ దంపతులను జీడిపప్పు దండతో నేతలు సత్కరించారు. కార్యక్రమంలో బంగారుబాబు, ముప్వల వెంకట రమణరావు, బండారుపల్లి హేమంత్‌కుమార్, పోతుల సమర్‌కుమార్, భరణి, భవానీ, కుమార్, చంద్ర, తాడివలస దేవరాజ్, మణికంఠ, ప్రత్తి సుబ్బారావు, బాంబే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టింగులు పెట్టవద్దు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

మేదరమెట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని పెద్దలు, రాజకీయ నాయకులు, ప్రముఖులపై అసభ్యకర పోస్టింగులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మొయిన్ హెచ్చరించారు. వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ పెట్రోల్ యాప్‌తో సోషల్ మీడియాలో వచ్చే అన్ని రకాల కంటెంట్‌లపై పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. అసభ్యకరమైన పోస్టులను వెంటనే తొలగించి పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. దసరా పండుగకు ఇళ్లకు తాళాలువేసి ఊరుకు వెళ్లేవారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. జాతీయ రహదారిలో వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఆపి ప్రమాదాలకు కారణం కావద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

ద్వైవాలరావూరు సొసైటీ అభివృద్ధికి సహకరిస్తా



చైర్మన్ సీతారామయ్యను సన్మానిస్తున్న అధ్యక్షుడు మద్దినేని రాఘవస్వామి, బాలినేని వీరయ్య

మేదరమెట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ద్వైవాలరావూరు సొసైటీ అభివృద్ధికి సహకరిస్తానని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య చెప్పారు.సోమవారం ద్వైవాలరావూరు సొసైటీలో జరిగిన మహాజన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వైవాలరావూరు సొసైటీ గురించి పూర్తిగా తెలుసుకున్నానని, ఇక్కడ సభ్యులకు రుణాలు ఇవ్వడం, వసూలు చేయడం ఎరువుల వ్యాపారం బాగానే జరుగుతోందని చెప్పారు. పీడీసీసీ బ్యాంకు కౌంటర్ ఏర్పాటు చేయాలని సొసైటి చైర్మన్ మద్దినేని రాఘవస్వామి, సభ్యులు బాలినేని వీరయ్య, తొట్టెంపూడి హరిబాబులు సీతారామయ్యను కోరారు. తప్పకుండా బ్యాంకు కౌంటర్ ఏర్పాటు చేస్తానని సీతారామయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటి మాజీ చైర్మన్‌లు ముమ్మన నరసింహారావు, బాచిన బాలకోటయ్య, వ్యవసాయ అధికారి రామ్మోహనరెడ్డి, మద్దినేని శ్రీనివాసరావు, మద్దినేని గోపి, గుర్రం లక్ష్మీనారాయణ, సొసైటి కార్యదర్శి సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

మార్టూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్వస్త్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా సోమవారం మార్టూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటరులో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రిలో ఉన్న వైద్యులతో పాటు ఇతర చోట్ల నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టరు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మానసిక వైద్యనిపుణులు సందీప్, చర్మవ్యాధుల వైద్యనిపుణులు హరిబాబు, చెవి ముక్కు వైద్య నిపుణులు స్రవంతి, దంతవైద్య నిపుణులు భానుచంద్రనాయుడు, డాక్టరు గార్గేయి, డాక్టరు భానుప్రసాద్‌లు దాదాపు 200 మందికి పైగా రోగులను పరీక్షించారు. ఇదిలా ఉండగా వారందరికీ రోటరీ క్లబ్ వారు ఉచితంగా భోజన ఏర్పాట్లు చేశారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 30 సెప్టెంబరు 2025





నెల్లూరులో భవానీ భక్తుల ప్రదర్శన



నెల్లూరు : సరస్వతీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

సరస్వతీ దేవతాయై నమః


చదువుల తల్లి సరస్వతీ అలంకరణలో దేవేరులు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొనగా, అమ్మవారి నామస్మరణలు మారుమోగాయి. నవావరణ పూజ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సంపుటీకరణ, చండీ హోమాలు, విశేష పూలంగి సేవలు తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. కొన్ని ఆలయాల్లో సామూహిక విద్యాభ్యాసం జరిగింది. భారీ సంఖ్యలో తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొనగా, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే రాత్రి శ్రీరాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో అర్ధమండలి దుర్గామాల కలిశాల ఊరేగింపు వైభవంగా జరిగింది. జై భవానీ... జైజై భవానీ అంటూ భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.



నెల్లూరు : పెన్నులు, పుస్తకాలతో కన్యకా పరమేశ్వరికి సరస్వతీ అలంకారం

ఈకేవైసీ చేయించుకోవాలి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన వారంతా ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ గంగా భవాని ఒక ప్రకటనలో తెలిపారు. 'ఉపాధి'లో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధి విధానాలను రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జాబ్ కార్డు కలిగిన వారంతా ఫొటోలు తీసి ఆధార్ సర్వేతో లింకు చేసి ఈకేవైసీ చేసుకోవాలన్నారు.



విస్తరిస్తున్న గోల్డ్ ట్రాప్ ముఠాలు

చౌక బంగారం పేరుతో పలుచోట్ల దోపిడీలు
నెల్లూరు జిల్లా కేంద్రంగా మొదలై ఇతర ప్రాంతాలకు వ్యాప్తి

వలవేసి బాధితులను బెదిరించి.. ఆపై దాడులు • రూ.కోట్లు కాజేస్తున్న దొంగల గ్యాంగులు • పోలీసుల ఉదాసీనతపై విమర్శలు

పోలీసు లాఠీలు, హ్యాండ్ కఫ్స్, పెద్ద తల్వార్(కత్తి), వాకీటాకీలు, పోలీసు యూనిఫాం, క్యాష్ కౌంటింగ్ మెషీన్లు, పిస్టళ్లు.. ఇవన్నీ ఏంటని అనుకుంటున్నారా..! నెల్లూరు జిల్లా కావలిలోని ఓ ఇంట్లో పోలీసులు ఇటీవల సోదాలు చేసిన సమయంలో దొరికిన ఆయుధాలు, వస్తువులు అవి. ఆ ఇల్లు.. తక్కువ ధరకు బంగారం పేరుతో భారీ మోసాలకు పాల్పడే గోల్డ్ ట్రాప్ గ్యాంగ్స్ ప్రధాన నాయకుడిది. పోలీసులు ఆ ఇంట్లోకి సోదాలకు వెళ్లే సమయంలో గ్యాంగ్ అనుచరులు అడ్డుకోగా, అతికష్టం మీద ఇంటి లోపలికి వెళ్లగలిగారు. కావలి కేంద్రంగా కొన్నేళ్ల క్రితం మొదలైన ఈ ముఠా మోసాలు క్రమేణా విస్తరిస్తున్నాయి. మొదట్లో ఒక్క గ్యాంగ్ మాత్రమే ఉండగా, ఇప్పుడు మూడు గ్యాంగులయ్యాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధాన గ్యాంగ్ కావలి కేంద్రంగా ఉంటూనే ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడుతుండగా, మరో గ్యాంగ్ హైదరాబాద్ కేంద్రంగా దందా చేస్తోంది. మూడో గ్యాంగ్ ఇప్పుడు నెల్లూరు కేంద్రంగా పంజా విసురుతోంది. ఈ గ్యాంగులు గత కొన్ని నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో ట్రాప్‌లు వేసి, రూ. కోట్లు దోచుకున్నట్లు, ఈ సమాచారం మొత్తం పోలీసుల వద్ద ఉన్నట్లు తెలిసింది.

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) :విజయవాడకు చెందిన ఓ డాక్టర్‌ను కావలి ముఠా గతంలో కర్నూలులో ట్రాప్ చేసింది. తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెప్పి అక్కడకు రప్పించి ఏకంగా రూ. 7.32 కోట్లు తీసుకొని నకిలీ బంగారాన్ని అంటగట్టింది. ఇది తెలిసి బాధితుడు తన డబ్బులు తనకు ఇచ్చేయాలని కోరగా, ఈ గ్యాంగ్ అతడిపై దాడి చేసింది. పోలీసుల వేషంలో ముఠా సభ్యులు బాధితుడిని బెదిరించారు. ఈ కేసును కర్నూలు పోలీసులు విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఆ క్రమంలోనే వారు కావలిలోని ప్రధాన నిందితుడి ఇంట్లో సోదాలు చేశారు. పోలీసు శాఖ వద్ద ఉండాల్సిన ఆయుధాలు ఆ ఇంట్లో ఉండటం చూసి వారు నివ్వెరపోయారు. అలానే ఇటీవల కావలిలోనే మరో వ్యక్తి నుంచి రూ. 50 లక్షలు, నెల్లూరులో మరో రూ. 60 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. గతేడాది ముత్తుకూరు జెన్కో రోడ్డులో జరిగిన రూ.40 లక్షల ట్రాప్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇటీవల ఓ డాక్టర్ రూ. 14.50 లక్షలు ఈ ట్రాప్ గ్యాంగ్ చేతిలో పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మళ్లీ ఈ వ్యవహారాలన్నీ బయటకొస్తున్నాయి. అయితే ఫిర్యాదులు అందని ట్రాప్‌లు చాలానే ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులెవరైనా పోలీసులకు ఫిర్యాదు చేయబోతే.. ఈ గ్యాంగ్ సభ్యులు పోలీసుల వేషంతో వచ్చి బెదిరిస్తారు. తర్వాత ఓ లాయర్ రంగంలోకి వచ్చి లొంగదీయడానికి చూస్తారు. కుదరని పక్షంలో దోచుకున్న దానిలో ఎంతో కొంత ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకోవడానికి చూస్తారు. వీటిని తప్పించుకున్న బాధితులే పోలీసులను ఆశ్రయిస్తున్నారని తెలుస్తోంది.

• ఎన్నో కేసులు.. అయినా లెక్కలేదు!

తక్కువ ధరకు బంగారం పేరుతోనే కాకుండా నకిలీ కరెన్సీ, రైస్ పుల్లింగ్ వంటి పలు రకాల మోసాలతో కూడా ఈ ట్రాప్ గ్యాంగ్స్ చెలరేగిపోతున్నాయి. ఈ గ్యాంగ్స్‌పై రాష్ట్రవ్యాప్తంగా వందల కేసులున్నట్లు తెలుస్తోంది. అయినా వీరికి లెక్కలేదు. ఈ గ్యాంగ్ సభ్యులకు కొందరు పోలీసులే అండగా ఉంటున్నారన్న ప్రచారముంది. రెండేళ్ల క్రితం కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌ను కొట్టిన కేసు విచారణ సందర్భంగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ సమయంలో ఈ గ్యాంగ్స్ చేతిలో మోసపోయిన అనేక మంది జిల్లాకు వచ్చి పోలీసులకు ఫిర్యాదులు కూడా చేశారు. కానీ ఆ తర్వాత ఆ ఫిర్యాదులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. ఇటీవల రౌడీయిజం విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో ఇప్పుడు నెల్లూరు ప్రశాంతంగా మారింది. ఆ విధంగానే ఈ ట్రాప్ గ్యాంగ్స్ విషయంలో కూడా కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఇంకా అనేక మంది సామాన్యులు నిలువుదోపిడీకి గురవడం ఖాయమని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పైసలిస్తేనే..
ఫైలు ముందుకు!

- లేదంటే రోజుల తరబడి కాలయాపన
- ఆపై ఫోన్లు చేసి వేధింపులు
- విద్యా శాఖలో వసూల్‌రాజా
- పేరుకే కాంట్రాక్టు ఉద్యోగి.. చేసేవన్నీ పైరవీలే!
- అధికారుల వత్తాసుపైనా విమర్శలు

జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఆయనో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించిన చిరుద్యోగి. అయితేనేం.. అధికారులను కలవాలన్నా, ఫైలు ముందుకు కదలాలన్నా ఆయన్ను ప్రసన్నం చేసుకోవాల్సిందే. కాదు.. కూడదంటే ఇక ఆ ఫైల్ మూలకు చేరిపోతుంది. లేదా సదరు ఉద్యోగి ఫోన్లు చేసి మరీ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారుల అండ కూడా ఉండటంతో ఆయనకు బాగా కలిసి వస్తోంది.

\- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

డీఈవో కార్యాలయంలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి(అటెండర్)కి పగ్గాలు అప్పగించారు. ఏ ఫైలు ముందుకు వెళ్లాలన్నా తొలుత ఆయన్ను ప్రసన్నం చేసుకోవాలి. ఆయనకు పైసలిస్తేనే ఫైలు కదులుతుంది. లేదంటే ఎన్ని నెలలైనా సరే సదరు ఫైలు ముందుకు కదలదని పలువురు బాధితులు తెలిపారు. ఒకవేళ ఆయన్ను ప్రసన్నం చేసుకోవడం ఆలస్యమైతే చాలు.. నిత్యం పది, పదిహేనుసార్లు ఫోన్లు చేసి తమను ఇబ్బందులు పెడుతున్నాడని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. కార్యాలయంలో తనకు ఉన్న తాధికారుల అండ ఉందని, ఏపని కావాలన్నా తాను మాత్రమే చేయగలనని ఆ అటెండర్ బహిరంగంగా చెబుతున్నాడు. కార్యాలయ అధికారులు, సిబ్బంది కూడా అదే రీతిలో వ్యవహరిస్తున్నారు.



● ఫైలు కదలాలంటే...

ఆ అటెండరుకి నగదు చెల్లించుకుంటే నెలలు, ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సిందేనని బాధితులు చెబుతున్నారు. ఎంతోమంది టీచర్లు, రిటైర్డ్ ఉద్యోగులు కార్యాలయ ఖజానాకు జమకట్టకుంటే ఇక ఎవరి పని కాదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ మెడికల్ రీఎంబర్స్‌మెంట్ అనుమతులకు, ప్రైవేట్ పాఠశాలల రెన్యువల్స్ చేయించుకునేందుకు పలువురు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎంతోకొంత నగదు ఇస్తామన్నా, వినకుండా తాను చెప్పినంత ఇస్తేనే పని చేసి పెడతామని ఆ అటెండర్ ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నాడు.

● అసలేం జరుగుతుంది...?

అసలు విద్యాశాఖలో ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. డీఎస్‌ఏ, ఎస్‌జీఎఫ్ పోస్టుల్లో రహస్యంగానే నియామకాలు చేపట్టి, మీడియాకు కూడా సమాచారం లేకుండా ఉత్తర్వులు జారీ చేశారు. నెల తర్వాత దీన్ని బయటపెట్టి, తమదేమి లేదని రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నట్లు అధికారులు చెబుతుండటం విశేషం. ఇటీవల అవినీతి ఆరోపణలు అధికమవడంతో అనుభవం ఉన్న సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీలు చేసుకుని వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం విద్యాశాఖ కార్యాలయంలో కీలకమైన సీట్లన్నీ ఖాళీగా ఉండగా, ఉన్నసిబ్బందిపై అదనపు పని భారం పడుతోంది. దీంతో సందట్లో సడేమియాగా అన్నట్లు ఈ అక్రమ వసూళ్ల పర్వ నిరంతరాయంగా కొనసాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టి సారించాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

శబరి.. ఇకపై సూపర్ ఫాస్ట్!

నేటి నుంచి మారనున్న రైలు నంబర్లు
హైదరాబాదు నుంచి త్రివేంద్రంకు 2గంటల ప్రయాణ సమయం ఆదా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేంద్రం మధ్య నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ నేటి నుంచి సూపర్ ఫాస్ట్ రైలుగా మారనుంది. ప్రస్తుతం 17229/30 నంబర్లతో నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి 20629/30 నంబర్లతో పరుగులు పెట్టనుంది. గతంతో పోల్చుకుంటే రైలు వేగం పెరగడంతో ఆ రైళ్లలో ప్రయాణించే వారికి సుమారు 2 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. నిన్న, మొన్నటివరకు సికింద్రాబాద్ నుంచి రోజూ మధ్యాహ్నం 12.20గంటలకు బయల్దేరే శబరి ఎక్స్‌ప్రెస్ మరుసటి సాయంత్రం 6.05గంటలకు త్రివేంద్రంకు (29.45గంటల ప్రయాణం) చేరుకునేది. తాజాగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారాక ప్రతి రోజూ మధ్యాహ్నం 2గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 6.25గంటలకు (28గంటల్లో) చేరనుంది. అలాగే, ఇంతకుమునుపు త్రివేంద్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45గంటలకు సికింద్రాబాద్‌కు (30గంటల్లో) వచ్చే శబరి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్‌గా మారాక త్రివేంద్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు ఉదయం 11గంటలకల్లా(27.45గంటల్లోగా) చేరనుంది.



ప్రయాణికులపై 'సూపర్ ఫాస్ట్' బాదుడు.!

శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ కావడంతో ప్రయాణ సమయం 2గంటలు ఆదా అవుతుందని ఒక వైపు ఆనందపడుతున్న ప్రయాణికులు, మరో వైపు సూపర్ ఫాస్ట్ చార్జీల రూపేణా జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు అదనంగా రూ.15, స్లీపర్ ఏసీ తరగతుల టికెట్లపై రూ.30నుంచి 40వరకు అదనంగా చెల్లించాల్సి రావడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇప్పటివరకు దక్షిణమధ్యరైల్వే ఆధ్వర్యంలో ఉండే శబరి ఎక్స్‌ప్రెస్ నిర్వహణ (మెయింటెనెన్స్) బాధ్యతలను నేటినుంచి సదరన్ రైల్వే చేపట్టనుందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	246

కోడిగుడ్ల ధర (100): 550

రోడ్లు కాదు.. మురుగు నీటి కాలువలు

కావలి రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చెంచుగానిపాలెంలో మురుగు కాలువలు లేక ఇళ్ల లోని నీరు మొత్తం రోడ్ల పైన నిల్వ ఉంటోందని గ్రామస్తులు వాపోతున్నారు. సీసీ రోడ్లు ఏర్పాటు చేసినప్పటికి మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టక పోవడంతో ఇళ్ల ముందే మురుగునీరు నిలుస్తుండడంతో దుర్గంధం భరించలేకపో తున్నామన్నారు. దోమల బెడద కూడా ఎక్కువగా ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీటి కాలువల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెంచుగానిపాలెంలో రోడ్డు పక్కన నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఇంటూరి

లింగసముద్రం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగిరేకులపాడు, చినపవని, సత్యనారాయణపురం, మేదరమెట్ల పాలెం గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రూ.2.34 కోట్ల నాబార్డు నిధులతో అంగిరేకులపాడు, సత్యనారాయణపురం వరకు నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. అలాగే సత్యనారాయణపురంలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే మేదరమెట్ల పాలెం, చినపవని గ్రామాలలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గోకులం షెడ్లు, చెత్త తయారీ సంపద కేంద్రాన్ని ప్రారంభించారు.



చినపవనిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

మౌలిక వసతుల కల్పనకు సిద్ధం

గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవనకల్యాణ్‌లు నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో గుంతలు లేని రహదారులే లక్ష్యమన్నారు. గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ జి చంద్రమౌళి, ఏఈ హనుమంతరావు, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, సిఎల్‌ఆర్సీ కోర్సు డైరెక్టరు జె బాబూరావు, ఏపీఓ సమీరబాషా, మండల టీడీపీ అధ్యక్షుడు పి గురునాథం, టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్, కె నాగేశ్వరరావు, సర్పంచు కె మాధవి, జి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం ప్రభుత్వ బాధ్యత

కావలి (టౌన్)సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ తీవ్రమైన పర్యావరణ సమస్యగా మారిందని, ప్లాస్టిక్ నిషేధం ప్రభుత్వ బాధ్యత అని చిన్నపిల్లల వైద్య నిపుణుడు మనోహర్‌బాబు, మైక్రోస్కోపిక్ సర్జన్ విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. సోమవారం టీవీఎస్ ట్రస్ట్ అధ్యక్షుడు తోట వేంకటేశ్వర్లు అధ్యక్షతన ఆర్టీసీ కూడలిలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన, గుడ్డ సంచుల పంపిణీ కార్యక్రమం జరిగింది. డాక్టర్లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ సంచులు వాడబోమని ప్రతిజ్ఞ చేయించారు. 'ప్లాస్టిక్ వద్దు-గుడ్డ సంచులు ముద్దు' అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేవీవీ నేతలు సుబ్బరాయశర్మ, ఖాదర్‌బాష, కందికట్లు నారాయణ, శారద, కలయ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న జేవీవీ సభ్యులు, వైద్యులు

రోజువారీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కావలి (టౌన్) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోజువారీ ప్రాతిపదికన పని చేసే మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి పర్మినెంట్ చేయాలని సీఐటీయు నాయకులు మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయు పట్టణ కార్యదర్శి పి తిరుపాల్ మాట్లాడుతూ పట్టణంలో రోజువారీ కార్మికులుగా సంవత్సరాల తరబడి పనిచేస్తున్న రోజువారి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు వై కృష్ణమోహన్, పెంచలయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు జే బాబు, ఒంగోలు రమేష్, తన్నీరు దొరసాని, ఒ రాణి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

అంగన్‌వాడీ సిబ్బందే తల్లులు, గురువులు

ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి,సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లే తల్లులు, గురువులుగా వ్యవహరించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లుగా నియమితులైన 30 మందికి సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే, సీడీపీవో సౌజన్య నియామక పత్రాలు అందచేశారు. సీఎం చంద్రబాబు పేదల కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు.



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందచేస్తున్న కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్.. ఓ వరం

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం 47 మందికి రూ. 30,50,513ల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షల వరకు బీమా సౌకర్యం లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిశోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు, పొట్లూరు శ్రీనివాసులు, బండి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బిట్రగుంట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతల కుటుంబ సభ్యులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బోగోలు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు మద్దిబోయిన వెంకటేశ్వర్లు, కడనూతల మాజీ సర్పంచు చల్లా నారాయణను ఎమ్మెల్యే పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దాసరి శ్రీనివాసులు తండ్రి వెంకయ్య ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబంతోపాటు, శెట్టిపల్లి రాజశేఖర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగులవరం టీడీపీ నేత కాండ్ర గోవర్ధన నాయుడు భార్య రత్నమ్మ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాలేపాటి శ్రీహరినాయుడు, పాముకాటుకు గురైన టీడీపీ మహిళా నాయకురాలు మాధవి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కొండబిట్రగుంటకు చెందిన యన్నాబత్తిన రమాదేవిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండలం కన్వీనర్ ఎం నాగేశ్వరరావు, ఎల్ సుధీర్‌బాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, కే వెంకటేశ్వర రెడ్డి, ఎల్ మాధవరావు, కే తిరుమలేష్, బీ ప్రభాకర్, కాండ్ర రఘురామనాయుడు, రామసుబ్బయ్య నాయుడు, డీ తిరుపతియాదవ్, ఫ్యాట్రిక్, అర్జున్‌రాజు, జిల్లా బీజేపీ నాయకుడు ఎన్ఎస్ యాదవ్, పీ శీనయ్య, రాజేశ్వరి, పీ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

కందుకూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాటర్పిల్లర్ వంటి ప్రముఖ బహుళజాతి సంస్థల్లో సాధించిన ఉద్యోగాల వెనుక అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధే కారణమని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాల అంతర్గత నాణ్యతాభివృద్ధి మండలి సమన్వయంతో వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టరు సుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ కె శ్రీహరి, రిసోర్స్ పర్సన్స్‌తో కలిసి సోమవారం కృత్రిమ మేథస్సు తాజా ధోరణులపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నప్పుడే విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించగలరన్నారు. కార్యక్రమానికి కర్రీ సతీష్, వి. బాలాజీ, చుంచు నరేష్‌బాబులు రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ హార్ట్‌డే !

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : నారాయణ ఆసుపత్రిలో ప్రపంచ గుండె వ్యాధుల దినోత్సవం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ రామ్‌కుమార్ గుండె వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.

సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



అల్లూరు : సరస్వతీగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కందుకూరు : సరస్వతీదేవిగా దుర్గాభవానీ అమ్మవారు



బిట్రగుంట : సరస్వతిదేవిగా రాజరాజేశ్వరిదేవి

అల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం అల్లూరులోని స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లు సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నార్తుమోపూరులోని పర్వతవర్ధిని అమ్మవార్లు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. కలుగోళమ్మ, పార్వతీ అమ్మవారు, గంగమ్మ, అంకమ్మల ఆలయాల్లో విశేషంగా పల్లకీ సేవలు నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కందుకూరు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామదేవత, ఆదిపరాశక్తి అంకమ్మ అమ్మవారితో పాటు కోవూరురోడ్డు లోని దుర్గాభవానీ అమ్మవారు, పెద్దబజారులోని సరస్వతీదేవి ఆలయంలో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో శరన్నవ రాత్రుల సందర్భంగా సోమవారం పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథరావుపేట కోదండరామాలయంలో రాజరాజేశ్వరీదేవి సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. బోగోలు షిరిడీసాయిబాబా మందిరం, రామస్వామి పాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కలిగిరి : మండలంలోని తెల్లపాడులో భద్రకాళి అమ్మవారు సోమవారం భక్తులకు కాత్యాయనీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృతస్నాపన అభిషేకాలతోపాటు కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 508 పసుపుకొమ్ములకు పూజలు నిర్వహించి భక్తులకు పంచిపెట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కావలి (టౌన్): గ్రామదేవత కలుగోళశాంబవి అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మవారు మాతంగీశ్వరి అలంకారం లో, కొత్త బజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మహిళా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విష్ణు ఆలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు ధనలక్ష్మీ అలంకారంలో వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. బృందావనం కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి ఉదయం హనుమంత వాహన, సాయంత్రం వసంతోత్సవం, పుష్పపల్లకీ ఉత్సవం, రాత్రి గజవాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహిళల కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి

కలెక్టరు, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కలెక్టరు హిమాన్షుశుక్లా, ఎస్పీ అజిత వేజెండ్లను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పథకాల అమలు, నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టరుతో, శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలపై ఎస్పీతో చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

టీ. సుబ్బరామిరెడ్డికి వేల కోట్ల రుణాలు రద్దు అన్యాయం



ఆందోళన నిర్వహిస్తున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

కావలి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వేత టీ సుబ్బరామిరెడ్డికి రూ.5,871 కోట్ల రుణాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయటం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. పేదలకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వకుండా, బడా పారిశ్రామిక వేత్తలకు వేల కోట్ల రుణాలు ఇచ్చి రద్దు చేయటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నేతలు జే. విజయరత్నం, నరసింహారావు, భాస్కర్, లక్ష్మీనర్సు, జెడ్డా వాసు పాల్గొన్నారు.

కిమ్స్ ఆధ్వర్యంలో 3 కే వాక్

నెల్లూరు(వైద్యం), (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ హృదయ వ్యాధుల దినోత్సవం సందర్భంగా 3 కే వాక్ నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జలదంకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలోని రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. బ్రాహ్మణక్రాక రైతు పండించిన ధాన్యాన్ని ఎమ్మెల్యే ట్రాక్టర్లో కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించారు. ధాన్యం నాణ్యత, నెమ్ము శాతం తెలుసుకునే యంత్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రం సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా పొరపాటు లేకుండా పార్టీలకతీతంగా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించాలని ఆదేశించారు. పరిమితికి మించి యూరియా వాడకం వల్ల పంటకు, భూమికి కలిగే నష్టాలను క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ ఏడీఏ, ఏఓలకు సూచించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భూసాంద్రత పెంచుకునేలా ప్రతీ రైతు కృషి చేయాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో రాళ్ళపాడు లాంటి ఒక్క సాగునీటి ప్రాజెక్ట్ కూడా లేకపోవడం గత పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తాను నియోజకవర్గంలో 149 చెరువులు పటిష్ట పరిచేందుకు సోమశిలప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ మధురెడ్డి సహకారం తీసుకున్నానన్నారు. కాలువలు, చెరువుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పీ మధురెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, జలదంకి సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్లు అప్పలనాయుడు, మధుసూదన రెడ్డి, జానీతో పాటు కూటమి నేతలు పూనూరు భాస్కర్ రెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, పున్నం రోశిరెడ్డి, డాక్టర్ సాయికుమార్, వడ్డే అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణక్రాకలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● కలిగిరి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మెన్ కదిరి వెంకట రంగారావు ప్రారంభించారు. గోనె సంచులు, రవాణా, కూలీల ఖర్చు ప్రభుత్వమే భరించి క్వింటాల్‌కి గరిష్టంగా రూ.2389 మద్దతు ధర అందిస్తోందన్నారు. రైతులు ధాన్యాన్ని దళారుల వద్ద అమ్ముకోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి సరైన మద్దతుధరకు అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



కలిగిరి : ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పీఏసీఎస్ చైర్మన్ రంగారావు తదితరులు

ఆర్టీసీ బస్టాండ్‌కు పూర్వవైభవం కల్పించండి

ఉలవపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు పూర్వవైభవం కల్పించాలని ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డికి గ్రామస్తులు వినతి పత్రం అందచేశారు. గత 15 ఏళ్లుగా వినియోగంలో లేకుండా పాడుపడిపోయిన ఆర్టీసీ బస్టాండ్‌ని సోమవారం జోనల్ చైర్మన్ పరిశీలించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆయనను కలిసి ప్రయాణికులకు సరైన షల్టర్ లేకపోవడంతో ఎండకు, వానకు అవస్థలు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌కు పూర్వ వైభవం కల్పించి మండల ప్రజలకు ప్రయాణ వెసులుబాటు కల్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో మాజీ సర్పంచు జీ ప్రసాదు, సీహెచ్ రాజారెడ్డి, కే కృష్ణారెడ్డి, పెద్దన్న శెట్టి, దసియ్య, వెంకటరమణ తదితరులు ఉన్నారు.



పాడుబడిన బస్టాండ్‌ను గ్రామస్థులతో కలిసి పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

రేషన్ సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు

ఉలవపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలలో బియ్యం సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు తీసుకొని ప్రజాపంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని జనసేన నాయకుడు మణికంఠ పవన్‌కుమార్ సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన డిజిటల్ కార్డులు పంపిణీ సక్రమంగా చేపట్టని ఒక డీలర్ తన సమీప బంధువుకు అప్పగించి డిజిటల్ వ్యాపారం చేయిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని, సదరు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



తహసీల్దార్ శ్రీనివాసులకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకుడు మణికంఠ పవన్‌కుమార్

గ్రామ పంచాయతీల్లో జీఎస్టీపై అవగాహన కల్పించాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అక్టోబరు 18వ తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ శంకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రాగ్రూపు లీడర్లు, వీఓఏలు, ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని తెలిపారు. కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. హైస్కూల్, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించుట, మోటారుబైకు ర్యాలీలు తదితర కార్యక్రమాలతో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

అక్రమంగా జామాయిల్ కర్ర నరికివేత

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): తన పొలంలో జామాయిల్ కర్రను గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా నరికివేసి తరలించుకుపోయినట్లు స్థానిక చందాడి కోటయ్య అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం పొలంలోకి వెళ్లి చూడగా జామాయిల్ చెట్లు నరికివేసి తరలించుకు పోయారని, సుమారు రూ. 10 వేలకు పైగానే ధర ఉంటుందని కోటయ్య వాపోయాడు.

వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కుమార్

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా నాయకుడు కుమార్ తెలిపారు. మండలంలోని చెర్లోపాలెంలో జిల్లా కమిటీ అధ్యక్షులు జాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలు, అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం మూడు పంటలు పండే కరేడులో వేల ఎకరాల భూములను రైతుల వద్ద బలవంతంగా సేకరించి ఒక ప్రయివేట్ వ్యక్తికి కట్టబెట్టడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరి జాన్, దార్ల నారాయణ, రవి, నాగార్జున శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఐడబ్ల్యూఐడీసీ డైరెక్టర్‌గా పోకూరి ప్రమాణ స్వీకారం



రాంబాబును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు,(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమం, మౌలికవసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పోకూరి రాంబాబు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం అమరావతి సమీపంలోని కుంచనపల్లి ఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు చల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.





పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు!

● ఆకట్టుకుంటున్న నల్లమల ఫారెస్ట్

చుట్టూ పచ్చని చెట్లు.. వాటి మధ్యలో ఎత్తయిన కొండలు.. నల్లని రోడ్డు.. ప్రకృతిప్రియులను ఇట్టే ఆకట్టుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు నల్లమల అడవిలో చెట్లన్నీ చిగురించాయి. దీంతో మొన్నటిదాకా వెలవెలబోయిన కొండలు ఇప్పుడు పచ్చని చెట్లతో ఆహ్లాదం పంచుతున్నాయి. నెల్లూరు-కడప జిల్లా సరిహద్దులో మర్రిపాడు పోలీసులు నిర్వహిస్తున్న నిఘాలో భాగంగా డ్రోన్ కెమెరాలతో ద్వారా తీసిన ఫొటోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

ఈ నీరు తాగేదెలా!?

అనంతసాగరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ అనంతసాగరంలో కుళాయిలకు రంగుమారిన నీరు సరఫరా అవుతున్నాయని, తాగేందుకు పనికిరావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వీధుల్లో ఈసమస్య కొంతకాలంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. నీరు మురికిగా వస్తుండంతో వాడుకునేందుకు, తాగేందుకు నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదంటూ వాపోతున్నారు. సమస్య ఎక్కడుందో గుర్తించి సురక్షిత నీరు సరఫరా అయ్యేలా అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.సాగరంలో కుళాయిలకు వస్తున్న రంగుమారిన నీటితో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఇప్పటికే గ్రామంలో జ్వరాలు ఉన్నాయి. ఇక కలుషిత నీరు వాడకం ద్వారా ఎలాంటి వ్యాధులు ప్రబలుతాయోనన్న ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా వైద్యఆరోగ్య శాఖ ద్వారా ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో ప్రజలకు నీటి వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిల్వ ఉంచుకోవడంతో కలిగే అనర్థాలు, దోమల లార్వా వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



కుళాయి నుంచి వస్తున్న రంగు మారిన నీరు



సరస్వతీ నమస్తుభ్యం!

● ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణలు

● సామూహిక విద్యాభ్యాసాలు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవార్లు సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో సరస్వతీ హోమాలు, పూజలు జరిగాయి. మరికొన్ని ఆలయాల్లో సామూహిక విద్యాభ్యాసం జరిగింది. భారీ సంఖ్యలో తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొనగా, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి, కన్యకా పరమేశ్వరి, ఇరగాళమ్మ, బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో కామాక్షి తాయి, కావలిలో కలుగోళమ్మ, రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలో ఆదిలక్ష్మి అమ్మవారు, నెల్లూరు రూరల్ మండలం వేదగిరిలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతోపాటు ప్రముఖ మహాలక్ష్మి ఆలయాల్లో సరస్వతీ అలంకరణలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



ప్రజా విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం),సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కి వచ్చే ప్రజా విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిమంది కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యల అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

● అర్జీదారులకు ప్రత్యేక సౌకర్యాలు

పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీదారులకు కలెక్టర్ ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. అర్జీదారులు ఎక్కువ సంఖ్యలో రావటంతో క్లాత్ పందిళ్లను ఏర్పాటు చేయించారు. సరిపడా కుర్చీలు ఏర్పాటు చేయించారు. అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జేసీ ఎం. వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● నిర్దిష్ట ఫార్మాట్‌లో పంపండి

ప్రభుత్వ కార్యాకలాపాలకు సంబంధించి ఈ-ఆఫీసులో పంపుతున్న ఫైళ్లను నిర్దిష్ట ఫార్మాట్‌లో పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక క్రమ సంఖ్యను కేటాయించి, ఆ నంబరు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

● పోస్టర్ ఆవిష్కరణ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 ఫలాలు ప్రజలందరికీ అందించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జీఎస్టీ తగ్గింపుతో 90 శాతం వస్తువుల ధరలు ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ జేసీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● అల్లూరురోడ్డు సెంటర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి పనులు పూర్తి చేయించాలని కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధామాధవ్, కొణిదల సందీప్, కలువాయి మండల అధ్యక్షుడు మనో హరి తదితరులు కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

● రూ. 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

నెల్లూరు (వైద్యం) : సంగం మండలం పెరమన క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం కింద రూ. 10 లక్షలు చెల్లించాలని సీపీఎం నేతలు కలెక్టర హేమాన్షు శుక్లాకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు కాయంబు శ్రీనివాసులు, ప్రసాద్, కొండయ్య, ధనలక్ష్మి, వెంగమ్మ, వైష్ణవి, అశ్వని పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 78 వినతులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరం లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 78 మంది వారి సమస్యలు తెలుపుకున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ గట్టమనేని శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్. రామారావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ టీ. శ్రీనివాసులు రెడ్డి, ఎస్బీ సీఐ శ్రీనివాసరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.



నడవలేని వృద్ధుడు వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

● అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

● పొదలకూరుకి చెందిన శ్రీనివాసులు, హైదరాబాదుకి చెందిన రవికుమార్‌లు వేదాయపాలెంకి చెందిన ఓ వ్యక్తికి క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధికంగా డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపించారు. దీంతో ఆయన రూ.8 లక్షల పెట్టుబడి పెట్టారు. అయితే అధిక ఆదాయం రాకపోగా తాను పెట్టుబడి పెట్టిన నగదు ఇవ్వాలని కోరుతుంటే వారు నగదు ఇవ్వకుండా బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

● చేజర్లకి చెందిన మహిళను అదే ప్రాంతానికి చెందిన దాసరి బాబు మోసం చేసాడని పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారని బాధితురాలు తెలిపింది. అయితే కేసు వెనక్కి చేసుకోవాలని తన వెంట బడుతూ వేధిస్తూ బెదిరిస్తున్నాడని ఆ మహిళ ఫిర్యాదు చేసింది.

● ఉదయగిరికి చెందిన ఓ వ్యక్తి పెద్ద కుమార్తె గత ఫిబ్రవరిలో ఉదయగిరి ఆనకట్టలో పడి చనిపోయినట్లు, ఉదయగిరి స్టేషన్‌లో కేసు నమోదు చేశారని, అయితే తన కుమార్తె మరణంపై అనుమానం ఉందని, లోతుగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ వ్యక్తి కోరారు.

రక్షణ కల్పించి, న్యాయం చేయండి...

● తనకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ నాయకురాలు కందికట్ల రాజేశ్వరి పోలీసు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదలకూరు మండలం మరుపూరులోని తన సొంత పొలంలో గత నెల 26న కొందరు టేకు చెట్లను దొంగతనంగా నరికి తీసుకెళ్లారన్నారు. ఈ ఘటనపై పొదలకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, స్పందించక పోగా కేసు తప్పు దోవ పట్టించారని ఆరోపించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె కోరారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇళ్లమధ్యలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార కేంద్రంపై దర్గామిట్ట పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నిర్వాహకులు పరారీలో ఉండగా విటుడును పోలీసులు అరెస్ట్ చేసి, ఇద్దరు సెక్స్ వర్కర్లను హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన కళ్యాణి, మురళిలు పోస్టల్ కాలనీ మూడోవీధిలోని ఓ ఇంటిని రెండు నెలల కిందట అద్దెకు తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనిపై సోమవారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్యకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి వ్యభిచార కేంద్రంపై దాడి చేశారు. పొదలకూరు మండలంకు చెందిన విటుడు మహేష్‌ను అరెస్ట్ చేసి ఇద్దరు సెక్స్ వర్కర్లను అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు.

అంతర్జాతీయ సాహితీ ఉత్సవంలో 'పెరుగు'కు ప్రశంసలు

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సాహిత్య అకాడమీలు బిహార్ ప్రభుత్వంతో కలిసి ఆసియాలోనే అతిపెద్ద సాహితీ ఉత్సవాన్ని ఈ నెల 25నుంచి 28 వరకు పాట్నాలోని సామ్రాట్ అశోక్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించాయి. 16 దేశాల నుంచి 555 మంది రచయితలు ఇందులో పాల్గొన్నారు. బిహార్ గవర్నర్ మహమ్మద్ ఆరీఫ్‌ఖాన్ ఉత్సవాలను ప్రారంభించగా, ముగింపు సభకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సాహితీ ఉత్సవంలో జిల్లా నుంచి ప్రముఖ అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ పాల్గొన్నారు. దిగులు లేని దేహం, మొహ స్వప్నం, అవతలి స్వరం అనే తెలుగు కవితలను ఆంగ్ల అనువాదం ద్వారా అందరికీ అర్థమయ్యేలా వినిపించి పెరుగు రామకృష్ణ పలువురి ప్రశంసలు పొందారు.



కవితలు చదువుతున్న పెరుగు రామకృష్ణ

జై భవానీ.. జైజై భవానీ!

● జోరు వర్షంలోనూ కలశాల ఊరేగింపు

● అడుగడుగునా భక్తుల నీరాజనం



నగరోత్సవంలో రాజరాజేశ్వరి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో అర్ధ మండలి దుర్గామాల కలిశాల ఊరేగింపు సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రత్యేక అలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో జై భవానీ.. జైజై భవానీ అంటూ దుర్గామాలాదారులు నగర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు పాత మున్సిపల్ కార్యాలయం పెన్నారేవులో పెన్నా జలాలను కలిశాలతో నింపుకున్నారు. శాస్త్రోక్తంగా పూజలు చేసి మేళతాళాలు, వేద మంత్రాలు, కర్పూర హారతులతో సంతపేట ఏసీబొమ్మ, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు, శబరి శ్రీరామక్షేత్రం, కొండాయపాలెం గేట్‌ల మీదుగా రాజరాజేశ్వరి ఆలయంకు చేరుకున్నారు. కలిశాల ఊరేగింపు భక్తులకు ఆలయ ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు వేదపండితులు ఘనస్వాగతం పలికారు. ఊరేగింపు నిషాంత్‌రెడ్డి, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, కొలపర్తి రమేష్‌కుమార్, చక్కా సునీల్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

గర్భిణులకు, చిన్నారులకు ఉన్నచోటే పోషకాహారం

● అందించే దిశగా ప్రభుత్వం చర్యలు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : ఉన్న ఊరు నుంచి మరో ఊరికి వెళ్లినప్పుడు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం అందక వారు అనారోగ్యానికి గురయ్యేవారు. కానీ అలాంటి వారికి పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినా, పోషకాహారం అందించేటప్పుడు స్థానికంగా లేకపోయినా వారు ఎక్కడున్నారో అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార సరకులు పొందటానికి అవకాశం కల్పించింది. గతంలో ఈ పరిస్థితి లేదు. ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ ట్రాకర్ యాప్ ద్వారా ఈ సౌకర్యం కలుగటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● జాతీయస్థాయి వరకు అందుబాటులోకి..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్న గర్భిణులు, బాలింతలు, శిశువులు, ఆరేళ్లలోపు చిన్నారుల వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆధార్ నంబరుతో సహా పోషణ్ ట్రాకర్ యాప్‌లో నవెూదు చేశారు. దీంతో వారి సమాచారం గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకు అందుబాటులోకి వచ్చింది. ఈ విధానం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న పోషకాహారం అర్హులకే అందనుంది. పక్కదారి పట్టడానికి అవకాశం లేదు. లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడే పోషకాహార సరకులు పొందే వీలు కలిగింది.

● తీసుకోవటం ఇలా...

ముత్తుకూరు నుంచి ఒక గర్భిణీ సూళ్లూరుపేటకు వెళ్లేటప్పుడు ముత్తుకూరులోని అంగన్‌వాడీ కార్యకర్తకు తెలియ చేయాలి. ఆ తరువాత సూళ్లూరుపేటకు ఆమె వెళ్లినప్పుడు, సూళ్లూరుపేటలోని సంబంధిత ప్రాంత అంగన్‌వాడీకి తాము ముత్తుకూరు నుంచి వచ్చామని తెలియచేయాలి. ఆ తరువాత ముత్తుకూరులోని అంగన్‌వాడీ కార్యకర్తకు ఫోన్ చేయాలి. ముత్తుకూరులోని అంగన్‌వాడీ కార్యకర్త ఆమెకు సంబంధించిన మైగ్రేషన్ అని ఆప్షన్‌పై క్లిక్ చేస్తారు. వెంటనే సూళ్లూరుపేటలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఆ గర్భిణీకి పోషకాహారం అందుతుంది. ఇలా చేయటం ద్వారా వారు అక్కడ ఉన్నంత కాలం పోషకాహారాన్ని ఎలాంటి ఆటంకం లేకుండా పొందవచ్చు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



కూరగాయల్లో పోషక విలువల గురించి బాలింతలకు వివరిస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

నేడు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం ఆత్మకూరులో పర్యటించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో స్థానిక అధికారులతో సమావేశం నిర్వహిస్తారని ఐ అండ్ పీఆర్ అధికారులు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తారని తెలిపారు. రాత్రి 8 గంటలకు ఆత్మకూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

కంప్యూటర్, వృత్తి నైపుణ్య కోర్సులలో ఉచిత శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ-గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా కంప్యూర్, వృత్తి నైపుణ్య కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని ట్రెడ్డి ఐటీ నిర్వాహకుడు కే.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9866111223 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు. శిక్షణ పొందాలనుకునే వారు విద్యార్హత ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో కోవూరు పట్టణంలోని కొత్తూరు రోడ్డులో ఉన్న కేఎస్ఎన్ ఇంజనీరింగ్ కాలేజీలోని ట్రెడ్డి ఐటీ విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

విద్యాభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలి

● అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



ప్రసంగిస్తున్న అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి నూతన ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ అన్నారు. నగరంలోని ఐఎంఏ హాలులో సోమవారం డీఎస్సీ-2025కు ఎంపికైన ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపడుతున్న వారందరూ ఎంతో బాధ్యతగా, క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా భావిభారత పౌరులను తీర్చిదిద్దాలన్నారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని గౌరవిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని, క్రమశిక్షణను పెంపొందించి ఉత్తమ భారతీయ పౌరులుగా తయారు చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వం అందించే శిక్షణలో పాల్గొని పాఠశాలల్లో చేరే నాటికి పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలని తెలిపారు. ఏపీ ఉపాధ్యాయ సంఘం దేశహితం కోసం, విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి పనిచేస్తోందన్నారు. ఉపాధ్యాయులందరికీ అపస్ అండగా ఉంటుందని, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన విద్యా వ్యవస్థలో సమష్టిగా పనిచేయాలని తెలిపారు. అనంతరం పాఠశాలల్లో విధులు, నిర్వహణ, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అపస్ జిల్లా అధ్యక్షుడు కేకే.రాజగోపాలాచారి, ప్రధాన కార్యదర్శి పీ.అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.చక్రపాణి, నేతలు రామకృష్ణ, రమేష్‌బాబు, చంద్రమౌళి, మణికందరాచారి, రాజేశ్వర్‌రావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూక దాడి

● కొత్త మినగల్లులో ఘటన

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త మినగల్లులో పాతకక్షల నేపథ్యంలో టీడీపీకి చెందిన నలుగురు యువకులపై వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన పట్టా శ్రీకాంత్‌కు రెండు కాళ్లు విరిగాయి. బంధువులు ఘటనాస్థలికి వెళ్లేసరికి శ్రీకాంత్‌ని నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. చింతల రమేష్‌ను కూడా పట్టుకున్నారని శ్రీకాంత్ చెప్పిన సమాచారంతో ఆయన కోసం గాలించినా ఆచూకీ తెలియ లేదు. రమేష్ చొక్కా, బనియన్ మాత్రం శ్మశానం పక్కన పొలాల్లో పడివుండడం చూశామని శ్రీకాంత్ అన్న శ్రీహరి తెలిపారు. శ్రీహరి తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాంత్ తోపాటు అతడి అన్న, బావమరిది, రమేష్ గ్రామ శివారులో పుట్టిన రోజు వేడుకలు చేసుకోవడాన్ని చూసిన వైసీపీ నాయకులు మారణాయుధాలతో శ్రీకాంత్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో రమేష్ ఆచూకీ తెలియలేదని బాధితులు చెప్పారు. గతంలో పలుసార్లు దాడులకు పాల్పడ్డారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కాగా శ్రీకాంత్‌పై హత్యాయత్నానికి పాల్పడిన మోచర్ల, రామ్మోహన్, అఖిల్, కౌశిక్, ఆ శీస్సు, నారయ్య, నవీన్ తదితరులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈమేరకు ఇన్‌చార్జ్ సీఐగా ఉన్న నెల్లూరు రూరల్ సీఐ వేణు, బుచ్చి ఏఎస్ఐ వెంకయ్య, సిబ్బందితో కొత్త మినగల్లు వెళ్లి విచారించారు.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు పట్టా శ్రీకాంత్

● విద్యార్థిపై దాడి

టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేష్‌ను పొగిడే పాటలను చింతల త్రిలోక్‌సాయి అనే పాలిటెక్నిక్ విద్యార్థి తన ఫోన్‌లోని ఇన్‌స్టాగ్రాం, స్టేటస్‌లో పెట్టుకున్నాడు. అలాగే పుస్తకాలు పెట్టుకునేందుకు పసుపు, ఎరుపు రంగులుండే బ్యాగు కొన్నాడు. అది నచ్చని వైసీపీ నాయకులు ఆ బ్యాగు వాడవద్దని హెచ్చరించారు. వినకపోవడంతో ఆ విద్యార్థిపై కూడా దాడి చేశారు.